


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 26-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 40 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## వైఎస్ జగన్‌పై
# హత్యాయత్నం

- ప్రతిపక్ష నేత భుజానికి గాయం
- విశాఖ విమానాశ్రయంలో ఘటన
- ఇలాంటి ఘటనలు నన్ను భయపెట్టలేవు
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి

విశాఖపట్నం: వైకాపా అధినేత వైఎస్ జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో దాడి జరిగింది. వీఐపీ లాంజ్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనపై వెయిటర్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో జగన్ ఎడమ భుజానికి స్వల్ప గాయమైంది. విమానాశ్రయ భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం తరువాయి 2లో..

*తాను దేవుడి దయవల్ల క్షేమంగానే ఉన్నానని, పజల ఆశీర్వాదమే తనను రక్షిస్తోందన్నారు. ఇలాంటి చర్యలను తనను భయపెట్టలేవని, రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు మరింత శక్తిమంతుడిని చేస్తాయంటూ ట్విటర్‌లో జగన్ పేర్కొన్నారు.*



### *ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత..*

హైదరాబాద్‌లో జగన్ చికిత్స పొందుతున్న ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. కొందరు అభిమానులు అక్కడికి చేరుకొని జగన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. మరో వైపు ఆయన సతీమణి వైఎస్ భారతి ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు.

### *జగన్ ఆరోగ్యంపై హెల్త్ బుల్లెటెన్ విడుదల...*



విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో వైఎస్సార్ సీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన దాడిలో ఆయన భుజానికి తీవ్ర గాయమైంది. దీంతో వైఎస్ జగన్‌ను వెంటనే హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రికి తరలించారు. భుజానికి తీవ్ర గాయం కావడంతో డాక్టర్లు ఆయనకు శస్త్ర చికిత్స చేశారు. వైఎస్ జగన్ భుజానికి ఎనిమిది కుట్లు వేశామని వైద్యులు తెలిపారు.

దుండగుడు పొడిచిన కత్తి వైఎస్ జగన్ శరీరంలోకి బలంగా దిగిందని వైద్యులు పేర్కొన్నారు. దాదాపు తరువాయి 2లో..





## వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కచ్చితంగా కుట్రే



హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హత్యాయత్నం చేసిన వ్యక్తి ఆయన అభిమానే అని టీడీపీ నేతలు, పోలీసులు చెప్పడాన్ని వైఎస్ఆర్ సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ట్విటర్ ద్వారా తప్పుబట్టారు. పబ్లిసిటీ కోసమే దాడి జరిగిందని చెప్పడాన్ని ఖండించారు. ఎయిర్ పోర్టులో జరిగింది తరువాయి 2లో..

## రాష్ట్రంలో క్షిణించిన శాంతిభద్రతలు

- ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలి
- ఏపీ డీజీపీ వ్యాఖ్యలపై మండిపడిన వైకాపా శ్రేణులు
- జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన
- దక్షిణ సమన్వయకర్త డా. పైడి వెంకట రమణ మూర్తి



విశాఖ సిటీః రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వంలో గత నాలుగున్నర సంవత్సరాల నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, విశాఖ విమానాశ్రయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రతిపక్షనాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడితో మరోసారి కుట్రలు బహిర్గతమయ్యాయని విశాఖ తరువాయి 2లో..

## 18 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

### పళనిస్వామికి హైకోర్టులో ఊరట .. ఢీలాపడిన దినకరన్ వర్గం



చెన్నై: తమిళనాడులో పళనిస్వామి ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. 18 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ విధించిన అనర్హత వేటు సబబేనని న్యాయమూర్తి సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై జూన్ 14న ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం విభిన్న తీర్పులు వెలువరించింది. దీంతో దీనిపై తుది తీర్పును మూడో న్యాయమూర్తికి అప్పగించారు. జులై 21 నుంచి కేసు విచారణ జరిపిన మూడో న్యాయమూర్తి సత్యనారాయణ ఆగస్టు 31వ తేదీన తీర్పును వాయిదా వేశారు. అప్పటి నుంచి తీర్పుపై పలు రకాల ప్రచారాలు తెరపైకి తరువాయి 2లో..

## పోలీస్ వ్యవస్థను బౌన్సర్లలా వాడుకుంటున్నారు



హైదరాబాద్: వైకాపా అధ్యక్షుడు జగన్‌పై జరిగిన దాడి విషయంలో తమకు బాధ్యత లేదని ఏపీ ప్రభుత్వం తప్పించు కునే ప్రయత్నం చేస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే రోజా ఆరోపించారు. గతంలోనూ విశాఖ విమానాశ్రయంలో జగన్‌ను స్థానిక పోలీసులే సివిల్ దుస్తుల్లో వచ్చి నిర్బంధించారన్నారు. జగన్‌పై దాడి ఘటన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేన్నారు. ఈ ఘటన తనను షాక్‌కు గురి చేసిందని చెప్పారు. పోలీసు వ్యవస్థను బౌన్సర్ల మాదిరిగా తెదేపా కార్యక్రమాలకు వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. నిఘా వ్యవస్థను రక్షణ, భద్రత కోసం వినియోగించడం లేదని తరువాయి 2లో..

## కేంద్ర ప్రయోజనాల కోసమే
# సీబీఐని భ్రష్టుపట్టిస్తున్నారు

- భయాలను సృష్టించేలా ఐటీ దాడులు
- ఇది కేంద్రం కుట్రలో భాగమే
- ఐటీ అధికారులకు స్వాగతం చెప్పి వివరిస్తాం
- సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి: కేంద్ర ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ దుర్వినియోగం చేస్తోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. గురువారం ఆయన కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ కేంద్రం తీరుని దుయ్యబట్టారు. రాష్ట్రంలో భయాలను సృష్టించేలా ఐటీ దాడులు చేయిస్తున్నారని... రోజు విడిచి రోజు ఐటీ దాడులు చేస్తున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాయి 2లో..






### విశాఖలో ఐటీ విస్తృత సోదాలు ఆర్థికంగా, పారిశ్రామికంగా అలజడి

వార్త 8వ పేజీలో..

## పబ్లిసిటీ కోసమే
# దాడి చేసినట్లుంది

- జగన్‌కు భద్రత పెంచుతాం
- ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్



మంగళగిరి: వైకాపా అధ్యక్షుడు జగన్‌పై దాడి చేసిన వ్యక్తిని తూర్పు గోదావరి జిల్లా ఠానేలంక గ్రామానికి చెందిన జానిపల్లి శ్రీనివాసరావుగా గుర్తించామని ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ చెప్పారు. విశాఖ విమానాశ్రయం వీఐపీ లాంజ్‌లోనే ఆయనపై దాడి జరిగిందని తెలిపారు. మంగళగిరిలో డీజీపీ మీడియాతో మాట్లాడుతూ... నిందితుడు దాడికి ఉపయోగించిన కత్తి విమానాశ్రయం లోపలికి ఎలా వచ్చిందనే విషయంపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు చెప్పారు. విమానాశ్రయంలో భద్రత మొత్తం సీఐఎస్ఎఫ్ పర్యవేక్షణలోనే ఉంటుందని డీజీపీ వివరించారు. నిందితుడు శ్రీనివాసరావు ఏడాదిగా అక్కడి రెస్టారెంట్‌లో పనిచేస్తున్నట్లు తెలిసిందని.. పబ్లిసిటీ కోసమే అతడు ఈ దాడికి పాల్పడినట్లు తరువాయి 2లో..



# భూసేకరణ వేగవంతం చేయండి; పునరావాస కల్పన చర్యలు చేపట్టండి

## సంయుక్త కలెక్టర్ వెంకటరమణారెడ్డి



విజయనగరం : జిల్లాలో వివిధ ప్రాజెక్టుల క్రింద అందజేయాల్సిన భూములకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం జెసి చాంబర్‌లో సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో జెసి మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టుకు సంబంధించి 2700 ఎకరాలు భూసేకరణకు గాను 60 ఎకరాలు ఇంకా సేకరించాల్సివుందని, ఆయా యజమానులతో చర్చించి వారికి పునరావాసం కల్పించి అంగీకార పత్రం తీసుకోవాలని లేదా భూసేకరణ నిర్వహించాలని సూచించారు. మరో 148 ఎకరాలు కోర్టు కేసులో వుందన్నారు. అదేవిధంగా తోటపల్లి బ్యారేజీకి సంబంధించి 500 ఎకరాలు భూసేకరణ నిర్వహించాల్సి ఉందని, తారకరామ తీర్ధసాగర్‌కు సంబంధించి 120 ఎకరాలు భూసేకరణ నిర్వహించాల్సి ఉందని తెలిపిన జెసి ఆయా భూములను త్వరితగతిన సేకరించి ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అదికారులు భూసేకరణ జరిగిన వెంటనే పనులు ప్రారంభించి సాగునీరు అందించాలన్నారు. గూడెపువలస, పోలిపల్లిలో చేపట్టిన పునరావాస కార్యక్రమాలు వేగవంతం చేయాలని, ఆ ప్రాంతాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని జెసి ఆదేశించారు. అదేవిధంగా అవార్డులు ఆమోదించిన భూములకు సంబంధించి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం, పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారులు జె.వి.మురళి, సుదర్శనదొర, ప్రత్యేక ఉప కలెక్టర్లు సాల్మన్‌రాజు, కె.సుబ్బారావు, సర్వే, భూముల శాఖ సహాయ సంచాలకులు గోపాలరావు, తహశీల్దార్ పెంటయ్య, తోటపల్లి, తారకరామతీర్ధసాగర్ ప్రాజెక్టు ఇఇలు, డిఇఇలు, సర్వేయర్లు, భూసేకరణ ఉప తహశీల్దారర్లు తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నను దర్శించుకున్న అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

### అప్పన్న భూసమస్యపై త్వరలోనే సానుకూలమైన పరిష్కారం



సింహాచలం : శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామి వారిని గురు వారం నాడు అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారు దర్శించు కున్నారు. ముందుగా అధికారులు ఆలయ సాంప్రదాయము ప్రకారం స్వాగతం పలుకగా అంతరాలయంలో అర్చక స్వాములు మంత్రి గోత్ర నామములతో ప్రత్యేకార్చనలు చేయగా అనంతరం కప్పస్తంభ ఆలింగనం చేసుకోగా బేడా మండపంలో ఆయనకి వైదికులు వేదాశీర్వచనం పలుకగా అధికారులు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కలెక్టరు రిపోర్ట్ పంపిం చారని దీనిపై త్వరలో సీఎం స్థాయిలో మీటింగ్ ఏర్పాటు అవు తుందని అప్పన్న స్వామి ఆశీస్సు లతో త్వరలో సానుకూలమైన పరిష్కారం లభిస్తుందని నిన్ననే ఈ విష యమై ప్రస్తావనకూడావచ్చిందని 578 జీవో ప్రకారం రెగ్యూలరైజ్ చేస్తూ రైతులకు న్యాయం చేయటానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయమని ఇంచార్జి మినిస్టర్‌కి గంటా శ్రీనివాసరావు చెప్పారని కనుక అప్పన్న ఆశీస్సులతో పంచ గ్రామాల భూ సమ స్యకు సానుకూలమైన పరి ష్కారం లభిస్తుందని అన్నారు.

# ఆర్టీసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి



నాతవరం : ఆర్టీసి బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం తుని నుంచి నర్సీపట్నం వస్తున్న ఆర్టీసి బస్సు నాతవరం మండలం గన్నవరం చెక్‌పోస్టు వద్ద వచ్చేసరికి చిక్కుడుపాలెం నుండి కొత్తపట్నం పల్సర్ బైక్‌పై వెళ్తున్న మిరపల మంగపతి(37)ని బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నాతవరం పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# ఘనంగా గౌరిపౌర్ణమి సంబరాలు

## భక్తిశ్రద్ధలతో శివపార్వతుల ప్రతిష్ట వేడుకలు

విజయనగరం: (సాలూరు)దసరా నవరాత్రులు ముగిసి విజయదశమికి సరిగ్గా ఐదు రోజుల్లో వచ్చే పౌర్ణమిని గౌరిపౌర్ణమిగా భావించిన ప్రజలు తమ ఇష్టదైవాన్ని గౌరి, శివపార్వతుల సమేత నందెమ్మ సంబరాలను పలు గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాలూరు ప్రాంతంలో గల వివిధ గ్రామాల్లో భక్తకుటుంబాలు తమ కుల దైవంగా కొలిచిన గౌరి సమేత శివ పార్వతి, నందెమ్మ విగ్రహాలను ప్రతిష్టించి భక్తులు తమతమ మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. పాచిపెంట మండలంలో గల పాచిపెంట కేంద్రంలో నాయుడు వీధికి చెందిన కుటుంబాలువారు నందెమ్మసంబరాలు ప్రతి రెండేళ్లుకి ఒకసారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కులదైవంగా భావించిన తాము ఎల్లవేళల్లో తమదైవం తమకు అండదండగా ఉంటుందని వారంతా విశ్వాసం వ్యక్తం చేశారు. తాము మొక్కులు చేసినందుకు ఫలితంగా చెల్లించేందుకు గౌరిపౌర్ణమి రోజున ఉదయం నుండి ఉపవాసాలు ఉండిన మహిళలు సాయంత్రం వేళ తొలుత పంట పొలాల్లో గల గౌరిదేవిని తీసుకువచ్చేందుకు డప్పు వాయిద్యాలుతో బయలుదేరి వెళ్తారు. పూజలు నిర్వహించిన మొత్తైదువులు తమ మెడలో గల బంగారు ఆభరణలు దరింపచేసి పసుపుకుంకుమలతో పూలమాలలతో ఆమెని అలంకరించి ప్రతిష్టకు తీసుకువస్తారు. కుమ్మరివారి ఇంటి వద్ద గల శివపార్వతుల ప్రతిమలు, నందిని పురుషులు, స్త్రీలు భక్తిశ్రద్దలతో తలపైన మోస్తూ ప్రతిష్టిస్తారు. అలాగే ప్రతిష్ట చేసిన నుండి ఐదు రోజులు అత్యంత భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహిస్తారు. అలాగే రాత్రి సమయాల్లో వినోద,సాంస్కృతిక కార్యక్రమాలు, సన్నిదాన ప్రాంతం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తారు.

# అంగన్వాడీలు, పాఠశాలలు తనిఖీ

రోలుగుంట : రోలుగుంట మండలం అడ్డసరం పంచాయతీలో గురువారం గ్రామదర్శిని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ మధుసూధన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ గల అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీలో సభ నిర్వహించి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులు వారు చేస్తున్నటువంటి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపిడిఒ శేఖర్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ విజేత, వెలుగు అధికారి లక్ష్మి, ఏపిఒ సూర్యమణి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

# అక్రమ చెరువుల తవ్వకందార్లుపై చర్యలు తీసుకోవాలి

## కుళ్లిన వ్యర్ధాలతో నీరు కలుషితం

మెంటాడ : సాగునీటి భూముల్లో అక్రమ చెరువులు ఏర్పాటు చేసి పల్లెల వాతావరణం, తాగు, సాగు నీటి వనరులను కలుషితం చేస్తూ అక్రమ చేపల వ్యాపారం చేస్తున్నవారికి అధికారులు వత్తాసు పలుకుతున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. చేపల చెరువుల ప్రక్క కోళ్లఫారాలుఏర్పాటుచేశారు. చనిపోయిన కోళ్లను, క్రుళ్లిపోయిన మాంసం ఇతర వ్యర్థాలు చేపలకు మేతగా వేస్తున్నారు. రైతుల పొలాలకు వెళ్లాల్సిన నీరు రిజర్వాయర్ కాలువ ద్వారా వచ్చేనీరు చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. చెరువులో నిల్వ ఉన్న నీరు కాలువ ద్వారా విడిచిపెడుతున్నారు. ఆ నీరు రైతుల పొలాల్లో చేరి పనులకు వెళ్లిన రైతులకు దురదలు, మంటలు ఇతరత్ర దీర్ఘకాలిక వ్యాధులు సోకుతున్నాయని చాలా మంది జ్వరాల భారిన పడి ఆర్థికంగా నష్టపోయామని కొత్త పిట్టాడ, లక్ష్మీపురం, సాకివలస, పిట్టాడ, చింతలవలస గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్రంగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. చేపల చెరువుల్లో గల వ్యర్థాలు దుర్గంధాలువలన రోడ్డుపై నడిచివెళ్లాలంటే చెడు దర్వాసనకు ముక్కుపుటలు అదిరిపోయేలా ఉందని కొందరు వాంతులు చేసుకోవాల్సి వస్తుందంటున్నారు. ప్రమాదకరమైన క్యాట్‌ఫిష్‌లను పెంపకం చేపడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ చేపల చెరువుల్లో అత్యంత ప్రమాదకరమైన మందుల తయారీలో ఉపయోగించే క్యాట్‌ఫిష్‌లను పెంచుతున్నారని వాటివలన ప్రజలకు నిత్యం రోగాలు దరిచేరి బాధపడుతున్నారు. రిజర్వాయర్ కాలువలున్న చోట్ల ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చి కారుచౌకగా రైతుల వద్ద నుండి భూములు కొనుగోలు చేసి వరిపండించే భూములను చెరువులుగా మార్చి ప్రజల ఆరోగ్యాలను హరించే చేపలను పెంచడం జరుగుతుందని ఈ చేపల వలన వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. చేపల చెరువులో నిల్వయున్న నీరు కాలువల ద్వారా రైతుల పొలాల్లోకి వస్తుందని పొలాల్లో పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్ నీరు చేపల చెరువులకు మళ్లించడం మూలంగా సాగుభూములకు నీరందకుండా పోతుందని పొలాలు ఎండిపోతున్నాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ చేపల చెరువులు తవ్వకందార్లుపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# కౌమారం...చాలా సుకుమారం: జేసీ-2 సీతారామారావు



విజయనగరం : ఆడపిల్లల్లో కౌమారదశ (10-14) ఒక సున్నితమైందని ఆ దశలో మానసిక వికాసానికి స్నేహపూర్వకమైన చతిని అందించడం పెద్దల అందరి భాధ్యత అని సంయుక్త కలెక్టర్ -2 జె.సీతారామారావు పేర్కొన్నారు. గురువారం కలక్టరేట్‌లో జరిగిన కిశోర బాలికల వికాసంపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ , విద్యాశీవఖ వైద్యఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయుఉ, ప్రిన్సిపాల్స్ సంబంధిత అధికారులతో ఒకరోజు శిక్షనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దశలో తల్లిదండ్రులదే ప్రధమ భాధ్యత అని వారిపట్ల అభిమానం చూపాలని, వివక్ష చూపరాదని హితవుపలికారు. ఇక ఏడవతరగతి నుంచి పదవతరగతి చదువుతున్న బాలికలని చక్కని నడవడికతో చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాలయులదని తెలిపారు. సంప్రదాయాలకు కట్టుబడి వున్నా కటుంబంలో వివక్షత చూపరాదని అన్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా చూడాలన్నారు. ఇంటర్, డిగ్రి స్థాయి విద్యార్థులకు కిశోరి బాలికలకు సోదరభావంతో స్నేహమస్తం అందించాలన్నారు. మండలాలు, డివిజన్ వారీగా ప్రిన్సిపాల్స కౌమారదశ విద్యార్థుల నివేదికలు తయారుచేస్తీ, శిశు సంక్షేమశాఖకు అందజేయాలన్నారు. జిల్లాలో బాలికలకు తగు చేయూత అందించేందుకు 3511 సహచర బృందాలను ఏర్పరిచి కార్యకర్తలాగా తయారుచేయాలని ఆఆదేశించారు. డి.ఇ.ఓ జి.నాగమణి మాట్లాడుతూ ఈ దశలో ఉన్న బాలికలు పట్టణాల్లో కన్నా, ఏజన్సీ గ్రామాల్లో ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటున్నారని వారికి ఏమితెలియక పోయినా, తెలిసినట్టు ప్రవర్తించే వారిని తగు జాగ్రత్తగా రక్షణ కల్పించవలసిన బాధ్యత చక్కని హృదయం ఉన్న అధికారులందరికపై ఉందన్నారు. ఈ సమావేశంలో పవర్‌ప్రజంటేషన్ ద్వారా ఐసిడిఎస్ పిడి వసంతబాల వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ ఎ.విజయలక్ష్మి, సర్వశిక్ష అభియాన్ ప్రాజక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు, డిఎస్.పి టి.త్రినాధ, వివిధ శాఖ అధికారులు, టీచర్లు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# వైఎస్ జగన్‌పై కత్తితో దాడి

విజయనగరం జిల్లాలో పాదయాత్ర చేస్తున్న జగన్.. అక్రమాస్తుల కేసులో శుక్రవారం నాంపల్లిలోని న్యాయస్థానంలో హాజరుకావాల్సి ఉంది. దీంతో హైదరాబాద్ వెళ్లేందుకు గురువారం మధ్యాహ్నం ఆయన విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానం బయలుదేరేందుకు సమయం ఉన్నందున వీఐపీ లాంజ్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ సమయంలో జగన్ వద్దకు వచ్చిన వెయిటర్ ఆయనతో సెల్ఫీ తీసుకుంటూ చిన్న కత్తితో దాడి చేశాడు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో జగన్ ఎడమ భుజానికి గాయమైంది. వైద్యులు ఆయనకు చికిత్స అందించారు. అనంతరం ఆయన హైదరాబాద్ పయనమయ్యారు. ఈ ఘటన జరిగిన వెంటనే విమానాశ్రయంలోని ప్రవేశించే మార్గాన్ని పోలీసులు మూసివేశారు. లోనికి ఎవరినీ రాకుండా అడ్డుకున్నారు. జగన్‌పై దాడి సమాచారం తెలుసుకున్న వైకాపా నేతలు పెద్దయెత్తున విమానాశ్రయానికి చేరుకున్నారు. స్థానిక ఏసీపీ హుటాహుటిన విమానాశ్రయానికి చేరుకుని సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిని తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన జరిపెల్లి శ్రీనివాస్‌గా గుర్తించారు. విశాఖ విమానాశ్రయంలో వైకాపా అధినేత జగన్‌పై దాడి తీవ్ర కలకలం రేపింది. విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో ఉండగా.. ఆయనతో సెల్ఫీ తీసుకుంటానంటూ వచ్చిన ఓ యువకుడు కత్తితో దాడి చేయడంతో జగన్ భుజానికి గాయమైంది. దీంతో తొలుత విశాఖలోనే ప్రథమ చికిత్స చేయించుకున్న జగన్.. ఆ తర్వాత నేరుగా హైదరాబాద్‌కు చేరుకొని సిటీ న్యూరో సెంటర్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ మేరకు ఆయన తన ఆరోగ్య సమాచారంపై ట్వీట్ చేశారు. తాను దేవుడి దయవల్ల క్షేమంగానే ఉన్నానని, ప్రజల ఆశీర్వాదమే తనను రక్షిస్తోందన్నారు. ఇలాంటి చర్యలను తనను భయపెట్టలేవని, రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు మరింత శక్తిమంతుడిని చేస్తాయంటూ ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.

### ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంఘటనలు జరగరాదుః పవన్ కళ్యాణ్

వైయస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం అమానుషం. ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంఘటనలు జరగరాదని జనసేన బలంగా విశ్వసిస్తుంది. ఈ హత్యా ప్రయత్నాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉంది. ప్రతిపక్ష నేతపై జరిగిన ఈ దాడిని తీవ్రమైనదిగా జనసేన భావిస్తోంది. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. గాయం నుంచి జగన్మోహన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. 'ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి కుట్రదారులను శిక్షించాలి' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు.

### క్రూరమైన దాడులకు స్థానం లేదుః నారా లోకేష్

వైయస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడిని ఏపీ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఆధునిక సమాజంలో ఇలాంటి క్రూరమైన దాడులకు స్థానం లేదని లోకేష్ అన్నారు.

### ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేపట్టాలిః కేంద్రమంత్రి సురేష్ ప్రభు

జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేపట్టాలని సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయంతో సహా అన్ని శాఖలను ఆదేశించారు. ఎవరు బాధ్యులో గుర్తించాలని విమానయాన శాఖ కార్యదర్శికి సూచించినట్టు వెల్లడించారు. జగన్‌పై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు.

### ఇది పిరికిపందల చర్యః ఎంఐఎం అధినేత ఓవైసీ

వైయస్ జగన్మోహన్ రెడ్డిపై విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇది పిరికిపందల చర్యగా అభివర్ణించారు. జగన్‌పై దాడి పూర్తిగా భద్రతా వైఫల్యమేనని పేర్కొన్నారు.

### రాజకీయాల్లో ద్వేషం, హింసకు తావుండరాదుః ఏపీ కాంగ్రెస్

జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడిని ఏపీ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపింది. రాజకీయాల్లో ద్వేషం, హింసకు తావులేదని స్పష్టం చేసింది.

### దాడికి కుట్ర అమానుషంః బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

విశాఖ విమానాశ్రయంలో వైయస్ జగన్మోహన్ రెడ్డిపై దాడి, తిరుపతిలో అమిత్ షా వాహనంపై దాడి, రాష్ట్ర పర్యటనలో నాపై దాడికి కుట్ర.. ఇవన్నీ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, శాంతి భద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో చెబుతున్నాయి' అని బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు.

# పబ్లిసిటీ కోసమే దాడి చేసినట్లుంది

తెలుస్తోందని డీజీపీ వ్యాఖ్యానించారు. నిందితుడి వద్ద 10 పేజీల లేఖ ఉందని.. దాన్ని సీఐఎస్ఎఫ్ సిబ్బంది రాష్ట్ర పోలీసులకు అందించారని చెప్పారు. ఆ లేఖపై విచారణ జరిపి వివరాలను త్వరలోనే మీడియాకు వెల్లడిస్తామన్నారు. పరిస్థితిని బట్టి జగన్‌కు భద్రతను పెంచుతామని ఆర్పీ ఠాకూర్ తెలిపారు.

# కేంద్ర ప్రయోజనాల కోసమే సీబీఐని భష్టుపట్టిస్తున్నారు

ఏపీలో దొంగ వ్యాపారం చేసేవారు ఎవరూ లేరని... ఐటీ అధికారులకు స్వాగతం చెప్పి ఇక్కడ ఏం జరుగుతుందో వివరంగా చెబుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సిబిఐని... భ్రష్టు పట్టించిన కేంద్రం రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రం సీబీఐని భ్రష్టుపట్టించిందన్నారు. నిబంధనల్ని కాలరాసి మోడీ అర్ధరాత్రి నిర్ణయాలు తీసుకున్నారని చంద్రబాబు విమర్శించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు పోతున్నామని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# రాష్ట్రంలో క్షిణించిన శాంతిభద్రతలు

దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి తన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై జరిగిన హత్యా యత్నాన్ని ఖండిస్తూ విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి పిలుపు మేరకు అన్ని వార్డుల అధ్యక్షులు, నాయకులతో కలిసి జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీఆర్ మాట్లాడుతూ కట్టుదిట్టమైన విశాఖ విమానాశ్రయంలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుందంటే అక్కడ శాంతి భద్ర తలు ఎంత క్షీణించి ఉన్నాయో అర్థమౌతోందని అన్నారు. రాష్ట్రంలో ముఖ్య నాయకులకే భద్రత కల్పించలేని ప్రభుత్వాలు, పోలీసులు ఇక సామాన్య ప్రజలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తాయని డాక్టర్ పివీఆర్ ప్రశ్నిం చారు. రాష్ట్ర పోలీసులు తమ విధులను మరిచి పసుపు పెద్దల కనుసన్నలలో మెలుగుతు న్నారని విమర్శించారు. ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అధినేత అయిన డీజీపీ ఠాకూర్ ఈ ఘటనను హేళన చేస్తూ మాట్లాడారని, పబ్లిసిటీ కోసమే ఈ హత్యోదంతం చేశారని అనడం అత్యంత హేయనీయమని అన్నారు. తమ నాయకుడు తక్షణమే కోల్కొని ప్రజాబాహుళ్యంలోకి త్వరగా రావాలని కోరుకుంటున్నట్లు డాక్టర్ పీవీఆర్ పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్ వెస్లే, నగర యువజన విభాగం అద్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, నియోజకకవర్గంలోని అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 18 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

వచ్చాయి. ఈ నేపథ్యంలోనే 18 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు సరైనదేనని న్యాయమూర్తి తుది తీర్పు వెలువరించారు. దీంతో పళనిస్వామి ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. మరోవైపు తీర్పు తమకు వ్యతిరేకంగా రావడంతో దినకరన్ వర్గం ఢీలా పడింది. తీర్పు వెలువడనున్న నేపథ్యంలో తమిళనాడులో హైడ్రామాకు తెరలేచింది. హైకోర్టు తీర్పుతో పళనిస్వామి సర్కారు ఊపిరి పీల్చుకుంది.

# జగన్ ఆరోగ్యంపై హెల్త్ బుల్లెటెన్ విడుదల...

4 సెంటీమీటర్ల లోతుకు కత్తి దిగిందన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన ధైర్యంగా ఉన్నారని వైద్యులు చెప్పారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షలకి పంపామన్నారు. కత్తికి విషం పూసారా, లేదా అన్నది పరీక్షల తర్వాతే తెలుస్తుందన్నారు. రిపోర్ట్ వచ్చాక డిశ్చార్జ్ ఎప్పుడనేది చెబుతామని వైద్యులు పేర్కొన్నారు.

# వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కచ్చితంగా కుట్రే

కాబట్టి అది పోలీసుల బాధ్యత కాదని టీడీపీ నేతలు చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. హత్యాయత్నం ఘటనపై విచారణ చేయకముందే ఏపీ డీజీపీ చేసిన వ్యాఖ్యలతో కుట్రను నీరుగార్చే ఉద్దేశం స్పష్టమవుతోందని వెల్లడించారు. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిన ఎయిర్‌పోర్టు తమ పరిధిలోనికి రాదని డీజీపీ చెప్పారు.. వైఎస్ జగన్ భద్రత, రక్షణ చర్యలను మరింత పటిష్టం చేయాలని, గతంలో చేసిన అనేక విజ్ఞప్తులను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు.

# పోలీస్ వ్యవస్థను బౌన్సర్లలా వాడుకుంటున్నారు

ఆమె విమర్శించారు. ప్రతిపక్షంపై రాజకీయ కక్ష సాధింపుచర్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు. చిత్తూరులో జిల్లాలో ప్రజాప్రతినిధులు కాని తెదేపా నాయకులకు రక్షణ కల్పించారని విమర్శించారు. జగన్‌పై దాడి ఘటనలో నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తే మాత్రం వదిలిపెట్టే పరిస్థితి లేదని ఆమె హెచ్చరించారు.

# నవరత్నాలు ప్రగతికి సోపానాలు

■ జగన్ కావాలి.. జగన్ రావాలి

■ తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నంః తెలుగుదేశం పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని విశాఖ తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం 3వ వార్డు పరిధిలో గల పెదగదిలి ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొంటూ గడప గడపకూ వెళ్లి నవరత్నాలు పథకం ప్రయోజనాలు గురించి సంపూర్తిగా వివరించారు. ఉదయం నుంచి కొండవాలు ప్రాంతాలలో వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలతో పర్యటించి ఇంటింటికీ వెళ్లి జగన్ కావాలి.. జగన్ రావాలి.. అంటూ నినాదాలు చేశారు. జగనన్న వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా వుంటుందని, లేదంటే కరవు కాటకాలతో జనం అల్లాడుతూనే వుంటారని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వానికి చరమగీతం పాడి వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీకి అధికారం కట్టబెట్టాలని ప్రచారం చేశారు. ముందుగా శ్రీకృష్ణ యువజన సేవా సంఘం, పెదగదిలి ప్రాంతం నుంచి ప్రారంభమైన యాత్రలో గడపగడపకూ వెళ్లి నవరత్నాలు ప్రయోజనాలు గురించి వివరిస్తూ జగన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ప్రతీ ఒక్కరికీ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా నవరత్నాలు ప్రగతికి సోపానాలు అంటూ వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పతివాడ కనకరాజు, తెలుగు కొండమ్మ, బొట్టా కనకరాజు, బసవమ్మ, రఘు, గొలగాని శ్రీను, చల్లా రాజు, రాజ్ కుమార్, నాగేశ్వరరావు, ధనలక్ష్మి, బుడుమూరి వినోద్, పీతల మహేష్, అజాం ఆలీ, పిట్టా రెడ్డి, మౌళి, కెఆర్‌వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 28న స.హ. ప్రచార ఐక్యవేదిక జిల్లా కమిటీ సమావేశం

### కమిటీ జిల్లా అధ్యక్షులు జక్కు నర్సింహమూర్తి



గొలుగొండః సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 28న చోడవరంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి జిల్లాలో గల అన్ని మండల కమిటీలు హాజరు కావాలని జిల్లా కమిటీ అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి కోరారు. ఆదివారం ఉదయం 10గంటలకు చోడవరం ప్రేమ్‌సమాజంలో జరిగే సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శులు ఆదిరెడ్డి కన్నబాబు, మాకిరెడ్డిలు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సమాచార కమిషర్లుగా రిటైర్డు ఐఎఫ్ఎస్ అధికారి ఎ.రవికుమార్, ఐపిఎస్ అధికారి బివి.రమణకుమార్, కె.జనార్ధన్‌లను నియమించడం జరిగిందని, వారి బాధ్యతలు కూడా చేపట్టారన్నారు. దీంతో పాటు విశాఖ సిటీలో నూతనంగా ప్రత్యేక సిటీ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లాలో మిగిలిన మండలాల్లో కూడా మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, శిక్షణా కేంద్రం ఏర్పాట్లపై కూడా చర్చించడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలో ఏజెన్సీ, మైదాన మండలాల్లో ఉన్న కమిటీల అధ్యక్ష కార్యదర్శులు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## పూరిజగన్నాధానికి ఎన్ఎస్ఎస్ పురస్కారం

యలమంచిలి రూరల్ః యలమంచిలి కళాశాలకు చెందిన ఆడారి పూరి జగన్నాధం జాతీయ సేవా పథకం పురస్కారం అందుకున్నారు. ఏయూలో విసి నుంచి పురస్కారం తీసుకున్నారు. జగన్నాధంను యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాల్యాద్రి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు, విద్యార్థులు అభినందించారు.

# ఇంటింటి నుండి చెత్తసేకరణ ఖచ్చితంగా నిర్వహించాలి

- రెండవ జోన్ 9, 10 వార్డులలో పర్యటన
- స్వీపింగ్, డ్రెయిన్ క్లీనింగ్ నిర్వహించాలి
- పారిశుధ్యలోపం లేకుండా విధులు నిర్వర్తించాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- చెత్త సేకరణ ఏజెన్సీ 10 రోజులలో మార్పుతేవాలి
- రోడ్ మార్జిన్స్, పుట్‌పాత్‌లు శుభ్రపరచాలి
- 10వ వార్డు కె.ఆర్.యం కాలనీలో పశువులు వేరొక చోటకు మార్చాలి
- డోర్ -టు-డోర్ చెత్త సేకరణ సమయాలను తెలియజేయాలి
- చెత్త సేకరణ వాహనాలు రూట్, టైమింగ్స్ నిర్వహించాలి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: జివియంసి పరిధిలో ఇంటింటి నుండి చెత్తసేకరణ ఖచ్చితంగా నిర్వహించాలని కమిషనర్ హరినరాయణన్ ఆదేశించారు. క్షేత్రపర్యటనలో భాగంగా రెండవజోన్ 9, 10 వార్డులలో పర్యటించి పలు సూచనలు చేశారు. రహదారుల స్వీపింగ్, డ్రెయిన్ క్లీనింగ్‌ను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. మెయిన్ రోడ్లే కాకుండా ఇంటర్నల్ రోడ్లను పారిశుధ్య లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టీకరించారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ నిర్వహించే ఏజెన్సీ నిర్వాహకుడు కళ్యాణ్ ఇంటింటి నుండి చెత్త సేకరణ నిర్వహించాలని ఆదేశించారు. రోడ్ మార్జిన్స్‌ను సిమెంట్ చేయాలని ఏసిపి నాయుడును సూచించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కె.ఆర్.యం కాలనీలో కాలువలు పరిశుభ్రం చేయడం లేదని, పశువులను కట్టి దుర్గంధం , అపారిశుధ్యానికి కారణమవుతోందని పేర్కొన్నారు. పశువుల యజమానులను తక్షణం వాటిని వేరే ప్రదేశానికి తరలించాలని, లేదా ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డోర్-టు-డోర్ చెత్త సేకరణ సమయాలను ప్రజలకు తెలియజేయాలని, చెత్త సేకరణ వాహ నాల సమయాలను నిర్దేశించాలని నిర్వాహకుడు కళ్యాణ్‌ను, శానిటరీ సిబ్బందని ఆదేశించారు.

పర్యటనలో రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, ఏసిపి నాయుడు, డి.ఇ పద్మావతి, ఏ.ఇ రాఘవులు, నాయుడు, శానిటరీ సూపర్‌వైజర్లు రాజు, రమణ, బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 27న సైన్సు డ్రామా పోటీలు

రోలుగుంటః జిల్లా స్థాయి సైన్సు డ్రామా పోటీలు ఈ నెల 27న విశాఖపట్నంలో గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్సు అధికారి కప్పల ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఇండియా సైన్సు డ్రామా ఉత్సవాల్లో భాగంగా మోక్షగుండం విశ్వేశ్వర టెక్నాలజకల్ మ్యూజియం, ఎన్‌సిఈఆర్‌టి వారి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. సైన్సు సొసైటీ అనే ప్రధాన అంశంతో డిజిటల్ ఇండియా, హెల్త్ హైజిన్, గ్రీన్ క్లోన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ అనే ఉప అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతీ గ్రూపులో 6, 8 తరగతులకు చెందిన విద్యార్థులు ఎనిమిది మంది ఉంటారని, ఈ డ్రామాలో పాల్గనే విద్యార్థిని విద్యార్థులు ఆడియో, వీడియో పరికరాలను వినియోగించుకోవచ్చునన్నారు. డ్రామా ప్రజెంటేషన్‌కు 50 మార్కులు, సందేశానికి 30 మార్కులు, నైపుణ్య ప్రదర్శనకు 20 మార్కులు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను వచ్చే నెల 1, 2 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

జిల్లాలోని అన్ని మండలాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు ఈ సైన్సు డ్రామా పోటీల్లో విజయవంతం చేయాలని విద్యాశాఖాధికారులకు, ఉపాధ్యాయులను సైన్సు అధికారి కోరారు.

# గ్రామదర్శినిలో సమస్యలు తెలియజేయాలి



నాతవరంః గ్రామదర్శినిలో సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి, డిపిఒ వి.కృష్ణకుమారి అన్నారు. గురువారం మన్యపురట్ల పంచాయతీలో గ్రామదర్శిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిచి సాంబారు పల్చగా ఉందని, విద్యార్థుల నాణ్యమైన సాంబారుతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలను గుర్తించి వాటిని అందజేస్తామన్నారు. అందరూ గ్రామదర్శినిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కనకారావు, ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరరావు, ఎంఇఒ అమృతకుమార్, ఏపిఎం మంగ, ఇతర శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎండిపోయిన వరి పంటలకు రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి



నర్సీపట్నంః కళ్యాణపులోవ రిజర్వాయర్ ఆయకట్టు భూములకు నీరు లేక ఎండి పోయిన వరి పటకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని, ఆ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకెఎస్) అనుబంధం ఆధ్వర్యంలో నర్సీపట్నం చిన్న, మధ్య తరహా నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు గురువారం ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శి కె. గోవింద రావులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ పరిధిలో కళ్యాణపులోవ రిజర్వాయర్‌ను 1978లో నిర్మించారన్నారు. ఆరు పంచాయతీల పరిధిలో ఉన్న 3576 ఎకరాల భూములపై ఆధారపడి జీవిస్తున్న 2వేల మంది కుటుంబాలు పంటలు పండించుకొని జీవించాలనే లక్ష్యంతో ఈ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారని తెలిపారు. 2014 నుండి రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలకు లీజుకు ఇవ్వడంతో పట్టిమంచాల గెడ్డ, బీరడుచెలు గెడ్డ, పూటగెడ్డలన్ని ధ్వంసం చేయడంతో కళ్యాణపులోవ రిజర్వాయర్‌కు నీరులేక ఎండిపోయిందన్నారు. కావున ఎకరా వరి పంటకు 25వేల నష్టపరిహారం ఇచ్చి, ఆ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు.

ఈ కార్య క్రమంలో నాయకులు వీరవిల్లి నారాయణరావు, కోట్న ప్రసాద్, విసారపు నానాజీ, విస్సారపు కృష్ణ, చిరంజీవి, రమణబాబు పాల్గొన్నారు.

# జగన్‌పై దాడి దురదృష్టకరం



అనకాపల్లి : వైఎస్ఆర్‌సిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిపై ఏయిర్‌పోర్టులో క్యాంటిన్‌లో పనిచేస్తున్న వ్యక్తి దాడి చేసి గాయపరచడం దురదృష్టకరమని, విశాఖ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర అన్నారు. రాష్ట్ర ఐటిశాఖ మరియు పంచాయితీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ విశాఖకు విచ్చేస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు ఏయిర్ పోర్టుకు వెళ్లిన సురేంద్ర విలేకర్లతో మాట్లాడుతూ ఇపుడు ఇప్పుడే నూతన అమరావతి లో విశాఖ విమానాశ్రయానికి ప్రపంచ దేశాల నుండి పరిశ్రమల స్థాపన కోసం విదేశాల నుండి వస్తున్న ప్రతినిధులుకు విశాఖ విమానాశ్రయం లో ఇటువంటి సంఘటన జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఇటువంటి సంఘటనలు అనుకోకుండా జరిగిన ఎవ్వరి ప్రోత్సాహంతో జరిగిన మళ్ళీ పునరావృతం కాకుండా దోసులను కఠినంగా శిక్షించాలని ఈ సంఘటనను అవకాశం గా తీసుకొని ప్రతిపక్ష పార్టీలు ఎ రకంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఇబ్బందికరమైన కార్యక్రమాలు చెయ్యకూడదు అని ఆయన కోరారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భీమునిపట్నంః భీమిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్పీడీవో కె.హరిప్రసాదరావు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. భీమిలి ఎంపిపి యరబాల కృష్ణవేణి ఈ సమావేశానికి అధ్యక్షత వహించనున్నట్లు ఎమ్పీడీవో తెలిపారు.

# ప్రజావ్యవస్థలను భ్రష్టు పెట్టించడమే బిజెపి లక్ష్యం



భీమునిపట్నంః ప్రజా వ్యవస్థలను భ్రష్టు పెట్టించడమే బిజెపి లక్ష్యమనీ టీడీపీ రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో హిట్లర్ తరహా పాలన కొనసాగుతున్నదని అన్నారు. భారతదేశాన్ని తిరుగులేని శక్తిగా మారుస్తానని ప్రసంగాలు చేసి ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్ర దర్యాప్తు సంస్థ లో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాలు బిజెపి పాలనకే మచ్చగా నిలిచాయని అన్నారు. బిజెపి నేతలు ప్రజలు మాట వినే పరిస్థితుల్లో లేరని అన్నారు. బిజెపి ప్రభుత్వంను ప్రశ్నించే ఏ వ్యవస్థ ను బిజెపి బ్రతకనివ్వడం లేదని వాపోయారు. నోట్లరద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలతో బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుకున్నట్లు చెప్పారు. ఈవిధంగా చూసి నట్లయిన సంపన్నుల కోసమే పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు.

రాఫెల్ కుంబకోణంతో పాటు తాజాగా సిబిఐ వ్యవస్థ లో అవకతవకలు వంటి భారీ కుంబకోణాలతో బిజెపి ప్రతిష్ట మసకబారిందని చెప్పారు. మోడీ మెప్పు కోసం భజన చేస్తున్న జివిఎల్, కన్నా లక్ష్మీనారాయణ తో పాటు ఇతర నేతలు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు.

ఈ సమావేశంలో తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల రమేష్, నాయకులు దేముళ్ళ,టీడీపీ యువత నాయకులు తమ్మిన సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పంటల పరిశీలన

రావికమతంః నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులను మండలంలో పలు గ్రామాల్లో పంటలను పరిశీలిచారు. గ్రామీణ వ్యవసాయ పని అనుభవంలో భాగంగా రావికమతం మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరకు మొదటి దశలో ఆశించే పీక పురుగును ట్రైకోగ్రామా కార్డుల ద్వారా నివారించుకోవచ్చునన్నారు. పీక పురుగు నివారణకు ఈ కార్డులు ఎంతో దోహదపడతాయన్నారు. పురుగు తీవ్రత బట్టి నాలుగు నుంచి ఆరు సార్లు కార్డులను తోటల్లో ఏర్పాటు చేయడం వల్ల తెగులును అరికట్టవచ్చునన్నారు. కార్డులను అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం రైతులను పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దానకర్ణుడు, రవి, భార్గవ్, గౌతమ్, ఎర్నానాయుడు పాల్గొన్నారు.

# భీమిలిలో గ్రామదర్శిని



భీమునిపట్నం : స్థానిక 23వ వార్డులో జోనల్ కమీషనర్ పి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ దర్శిని కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గ పరిధిలో రెండు వేల నాలుగు వందల కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి సామాజిక భవనాలు, సి సి రోడ్లు, కాలువలు గంటా శ్రీనివాసరావు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు కోట్ల 72 లక్షల 86 వేల రూపాయలుతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎస్.ఐ. శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు సుధాకర్ ,టి.పి.ఆర్.ఓ శ్రీనివాస్, సి.ఒ రమణ, టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, గిడుతూరి శ్రీనివాసరావు గూడపు రాజు జన్మభూమి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాధికారమిత్రల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### గ్రామాల సమస్యల పరిష్కారం కోసమే గ్రామదర్శి



నర్సీపట్నంః సాధికార మిత్రల సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి బివి.రమణ అన్నారు. గురువారం చెట్టుపల్లి గ్రామంలో గ్రామదర్శినిలో పాల్గన్న ఆయన ఎంపిపి సుకల రమణమ్మ, వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ముందుగా పాఠశాలను పరిశీలించి ఆర్వోప్లాంట్ పని చేయకపోవడాన్ని పరిశీలించి వెంటనే ప్లాంట్ అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అనంతరం జరిగిన సమావేశంలో ప్రత్యేకాధికారి మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు గ్రామదర్శిని ద్వారా పరిష్కరిస్తామన్నారు. అనంతరం సాధికార మిత్రలతో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జయమాధవి, తహశీల్దార్ వివి.రమణ, నోడల్ ఆఫీసర్, హౌసింగ్ ఎఇ జికెఎస్.నాయుడు, ఈఒపిఆర్‌డి ప్రేమలీల, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, ఐకెపి, టీడీపీ నాయకులు మోపాడ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



భీముని పట్టణము భీమిలి తోటవీధి కమ్యూని హల్ మెజిక్ బస్సు వారు నిర్వహించిన వంటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్ ఐ శ్రీ ను,జోనల్ కమీషనర్ ,భీమిలి టీడీపీ జోన్ ప్రెసిడెంట్ గంటా.నూకరాజు.ఇందులో మేజిక్ బస్సు సిబ్బంది, టీడీపీ నాయకులు గిడుతూరి. శ్రీ నువాసరావు లు పాల్గొన్నారు


RELIANCE CAPITAL

డిమాండ్ నోటీసు

**రిలియన్స్ క్యాపిటల్ లిమిటెడ్**

బ్రాంచ్ ఆఫీస్: ద్వారకా నగర్, 1వ లైన్, ద్వారకా నగర్, 1వ లైన్, సంగం శరత్ థియేటర్ ప్రక్కన్న, విశాఖపట్నం - 530016 హైదరాబాదు బ్రాంచ్ ఆఫీసు: మాలిక్ ఎస్టేట్& 6-3-344, మూడవ అంతస్తు, జెవై రావు పార్కు ఎదురుగా, రోడ్డు నెం.1, బంజారా హిల్స్, హైదరాబాద్ కార్పొరేట్ & రిజిష్టార్ ఆఫీసు:- హెచ్ బ్లాకు, 1వ అంతస్తు, ధీరూబాయి అంబానీ నాలెడ్జ్ సిటీ, కోపార్కరైన్, నావి ముంబాయి- 400710

క్రింద పేర్కొన్న రుణ గ్రహీతలు/సహరుణ గ్రహీతలు/తాకట్టుదారులు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి ఆర్థిక సాయం పొందియున్నారు. మేము తెలియచేయునది ఏమనగా ఆర్థిక సాయం మా నుంచి పొందినప్పటికీ సదరు రుణ గ్రహీతలు/సహరుణ గ్రహీతలు/తాకట్టుదారులు గడువు తేదీల ప్రకారం చెల్లించాల్సిన వడ్డీ మరియు మూలధనమును తిరిగి చెల్లించడంలో పలు తప్పిదములు చేసినారు. ఖాతాను సదరు తేదీలలో నాన్ పర్‌ఫార్మింగ్ అస్సెట్‌గా నేషనల్ హౌసింగ్ బ్యాంకు ద్వారా జారీ కాబడిన వర్గీకరించి, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి నిర్ణయం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యొక్క సెక్యూరిటీజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ క్రింద & సెక్షన్ 13(2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 3తో వర్తించు దాని క్రింద అధికారముతో ఎస్ఎఆర్ఎఫ్ఎ ఇఎస్ఐ చట్టం, 2002 యొక్క సెక్షను 13(2) క్రింద సదరు తేదీలలో క్రింద పేర్కొన్న రుణ గ్రహీతలు/సహరుణ గ్రహీతలు/తాకట్టుదారులుకు నోటీసులలో పేర్కొన్న విధంగా ఇన్సిడెంటల్ ఖర్చులు, కాస్ట్, ఛార్జీలు తదితరములు క్రింద పేర్కొన్న సొమ్మును నోటీసులు వారికి అందిన రోజు నుంచి 60 రోజులలోగా చెల్లించమని డిమాండ్ నోటీసులు వారికి పంపబడినవి.

వారు చివరిసారిగా మాకు పేర్కొన్న చిరునామాలకు పంపిన సదరు నోటీసులు వారికి చేరకుండా మాకు తిరిగివచ్చినాయి. కావున ఈ విషయమును పబ్లిక్ నోటీసు ద్వారా తెలుపుతున్నాము.

| ఋణగ్రహీత పేరు/చిరునామా | డిమాండ్ నోటీసు తేది | ఔట్‌స్టాండింగ్ నగదు | లోన్ నగదు | సెక్యూర్డ్ అస్సెట్ల ప్రాపర్టీ చిరునామా |
|---|---|---|---|---|
| లోను అకౌంటు నెం. ఆర్ఎల్ఎంఇహెచ్‌వైడి000268604, ఆర్ఎల్ఎంఇవిఐజెడ్000308407, & ఆర్ఎల్ఎల్ఆర్‌విఐజెడ్000336345 1. సురక్ష హెల్త్ పార్కు ప్రైవేట్ లిమిటెడ్ 2. బొడ్డేపల్లి రఘు 3. కృష్ణారావు పెదాడ 4. శ్రీ రామమూర్తి బొడ్డేపల్లి 5. కామేశ్వరరావు | 25 సెప్టెంబరు - 2018 | రూ. 1,95,99,782/- (కోటి తొంబ్బై ఐదు లక్షల తొంబ్బై తొమ్మిది వేల ఏడు వందల ఎనబ్బై రెండు రూపాయలు మాత్రమే | రూ. 3,07,77,253/- (మూడు కోట్ల ఏడు లక్షల డబ్బై ఏడు వేల రెండు వందల యాబ్బై మూడు రూపాయలు మాత్రమే) | గ్రౌండ్+ పై రెండు ఫ్లోర్లు డోర్ నెం. 2-25-52 & 52/1, ఎల్.పి. నెం.128/98, ఫ్లాట్ నెం.01, టిఎస్ నెం.-826/పి, 823/పి, ఆర్ఎస్.నెం.-111, 105/1, బ్లాకు నెం. 29, బలగవార్డు, శ్రీకాకుళం మున్సిపాలిటీ, ఎపి & హద్దులు క్రింది విధంగా కలవు. 357 చదరపు గజాల విస్తీర్ణం తూర్పు: ఫ్లాట్ నెం.5 (ఓపెన్ ఫ్లాటం) దక్షిణ:: వెంకటేశ్వర్వు ఆస్తి (డోర్ నెం.2-25-51) పశ్చిమం: 40 అడుగులు రోడ్డు, ఉత్తరం: 40 అడుగుల రోడ్డు |

ఇట్టి పరిస్థితులో పైన తెలిపిన విధంగా పైన పేర్కొన్న ఋణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, మరియు /లేదా వారి హామీదారులుకు (వర్తించుచోట) ఔట్‌స్టాండింగ్ డ్యూలు పైన తెలిపిన విధగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు చార్జీలతో నోటీసు పంపబడింది. 60 రోజులలోగా చెల్లించనచో తదుపరి రుణగ్రహీతలు మరియు తాకట్టుదారులు సెక్యూర్డ్ అస్సెట్లు సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క ఫైనాన్షియల్ అస్సెట్లు మరియు ఎన్‌ఫోర్స్‌మెంటు యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీ-కన్‌స్ట్రక్షన్ యొక్క సెక్షను 13(4) క్రింద మరియు తదుపరి వర్తించు చట్టాల క్రింద సెక్యూర్డ్ ఆస్తులు జప్తు చేయబడును.

**పేర్కొనబడిన చట్టపు సెక్షను 13(13) క్రింద ఏ ఋణగ్రహీత కూడా నోటీసుల్లో తెలిపిన సెక్యూర్డ్ అస్సెట్లను సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వ్రాతపూర్వక ఉత్తర్వులు లేకుండా సెక్యూర్డ్ అస్సెట్ల అమ్మకము, లీజు లేదా ఇతరములు జరపరాదని గమనించగలరు.**

**తేది: 26/10/2018**
**ప్రదేశం: వైజాగ్**

**సం/- అధీకృత అధికారి**
**రిలయన్స్ హోమ్‌ఫైనాన్స్ లిమిటెడ్**

# విజయభాను

## సంపాదకీయం

### క్యాన్సర్ మహమ్మారిని తొలగించాలి

ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న క్యాన్సర్‌పై ప్రత్యామ్నాయ వైద్య విధానంలో విజయం సాధిస్తున్న వైద్య శాస్త్రవేత్తలు అమెరికాకు చెందిన జేమ్స్ అలిసన్, జపాన్‌కు చెందిన తాసుకు హోంజోలకు వైద్య నోబెల్ దక్కటం ముదావహం. వీరిద్దరికి 2014లోనే ఆసియా నోబెల్‌గా ఖ్యాతిగాంచిన టాంగ్ ప్రైజ్ లభించింది. వీరిద్దరూ క్యాన్సర్‌ను ఎదుర్కోవటం, దాని నివారణపై సంప్రదాయ విధానానికి భిన్నంగా తమ పరిశోధనలు సాగించి విజయం సాధించారు. ఆసియా నోబెల్ గెల్చు కున్న వీరికి తదుపరి నోబెల్‌కు దారి సుగమమైందని ప్రపంచం నాడే గుర్తించింది. ఈ నేపథ్యంలోనే వీరిద్దరికీ వైద్యంలో నోబెల్ ప్రకటన ఊహించిందీ, ఆహ్వానించదగిందే. వీరు మనిషి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచటం ద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి ఎలా బయటపడచ్చో కనుగొన్నారు. సాధారణంగా క్యాన్సర్ వ్యాధి సోకిన శరీర భాగాన్ని తొలిగించి, ఆ భాగంపై ఔషధ ప్రయోగంతో దాని తీవ్రతను తగ్గిస్తూ క్రమంగా దాన్ని నివారించటం చేస్తారు. లేదా నేరుగా క్యాన్సర్ కణాలనే లక్ష్యంగా చేసుకొని చికిత్స కొనసాగిస్తారు. దీనికి భిన్నంగా రోగనిరోధక శక్తిని పెంచటం ద్వారా క్యాన్సర్‌ను ఎలా నియంత్రించవచ్చో తమ పరిశోధనల ద్వారా రుజువు చేశా రు. తద్వారా ప్రపంచానికి వైద్యశాస్త్రంలో కొత్త దారులు వేసిన అలిసన్, హోంజోలు వైద్య నోబెల్‌కు అసలైన అర్హులు. ఈ సందర్భంగానే వీరి పరిశోధనలు మరింత ముందుకుసాగి అన్నిరకాల క్యాన్సర్‌ల నుంచి మానవాళిని విముక్తి చేసే దిశగా సాగాలని ఆకాంక్షిద్దాం. క్యాన్సర్ అనగానే చాలామంది ఒక వ్యాధి అనుకుంటారు. లేదా ఒకటే వ్యాధిగా భావిస్తారు. నిజానికి క్యాన్సర్ అనేది అనేక వ్యాధుల సమాహారం. వైద్యుల పరిభాషలోనే వివిధ రకాల క్యాన్సర్లు 120 దాకా ఉన్నాయి. ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యమయమైన ఆహారపదార్థాల కారణంగా క్యాన్సర్ నానాటికీ పెరుగుతు న్నది. కూరగాయలు, పండ్లు, పాలు, నీళ్లలో విషపదార్థాల అవశేషాలుండటం ఆందోళన కలిగించేదే. పసిపిల్లలు కూడా తల్లిపాలలోని విషపదార్థాల మూలంగా క్యాన్సర్ బారినపడుతున్న తీరు అత్యంత ఆందోళనకరం. మన దేశంలోనే ఏటా ఏడు లక్షల మందికి కొత్తగా క్యాన్సర్ సోకుతున్నది. వీరిలో దాదాపు ఐదున్నర లక్షల మంది క్యాన్సర్ కారణంగా చనిపోతున్నారు. అంటే క్యాన్సర్ వ్యాధి సోకిన వారిలో 20 శాతం మంది మాత్రమే బతుకుతున్నారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కూడా క్యాన్సర్ వచ్చిన తర్వాత జీవితకాలాన్ని సగటున మరో ఐదేండ్లు పొడిగించడం సాధ్యమవుతున్నది. ఈ సగటు పొడిగింపు గతంలో 40 శాతం ఉంటే అదినేడు 60 శాతానికి పెరిగింది. ఇప్పటికీ దేశంలో రోజుకు 1300 వందల మంది క్యాన్సర్‌తో చని పోతున్నారు. 2014లో చూస్తే ఐదు లక్షల మంది చనిపోయారు. అయితే క్యాన్సర్‌పై జాతీయంగా, అంతర్జాతీయంగా వైద్యశాస్త్రం ద్వారా, సామాజిక చైతన్యం ద్వారా పెద్ద యుద్ధమే ప్రకటించటం జరిగింది. దేశదేశాల్లో క్యాన్సర్ కారకాలను గురించి ప్రచారం చేయటం, నివార ణ చర్యలు తీసుకోవటం గురించి పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటన్నింటి కారణంగా గతంతో పోలిస్తే ఇది ఎంతో మెరుగని చెప్పుకున్నా జీవిత కాలా న్ని పొడిగించటం మాత్ర మే చేయగలుగుతున్న మనం క్యాన్సర్‌ను పూర్తిగా రూపుమాపలేకపోతున్నామనేదే సమస్య. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాప్తి గురించిన గణాంకాలు చూస్తే ఆధునిక అభివృద్ధికి తలమానికంగా చెప్పుకుంటున్న అమెరికాలోనే క్యాన్సర్ ఎక్కువగా ఉంటున్నది. ఏటా అమెరికాలో 16 లక్షల కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీన్ని బట్టి ఆధునికాభివృద్ధికీ, క్యాన్సర్‌కు అవినాభావ సంబంధం ఉన్నట్లు బోధపడుతున్నది. దీన్ని సరైన రీతిలో గుర్తించి, నివారణ, ప్రత్యామ్నాయ మార్గాల్లో పయనించినప్పుడే క్యాన్సర్ మహమ్మారి నుంచి తప్పించుకోగలం అనేది నిజం. ఆ దిశగా ఇప్పటికైనా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. మనిషిని రోగపీడితున్ని చేస్తున్న ఆధునిక జీవనశైలిలో సమూల మార్పులకు అంకురార్పణ చేస్తూనే, ప్రత్యామ్నాయ వైద్య విధానాలకు కూడా పెద్దపీట వేయాలి. క్యాన్సర్‌నే తీసుకుంటే.. ఇవ్వాళ క్యాన్సర్ ను నియంత్రించటం కోసం చేస్తున్న కీమో థెరపీ అనేదే పెద్ద అశాస్త్రీయమని విమర్శలొస్తున్నాయి. కీమోతో నిర్దేశిత అవయవం, చోటులో క్యాన్సర్ కొంత తగ్గుముఖం పట్టినా, అది శరీరంలోని మిగతా భాగాలన్నింటికీ విస్తరించటానికి కారణమవుతున్నదని తాజా అధ్యయనాలు అంటున్నాయి. అలాగే మధుమేహం (షుగర్) నియంత్రణ కోసం ఇస్తున్న మాత్రలు కూడా పెద్ద అశాస్త్రీయమని ప్రత్యామ్నాయ ప్రకృతి వైద్య విధానం చెబుతున్నది.

## అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయండి



విజయనగరం : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంభిస్తోందని బిజెపి రాష్ట్రనాయకుడు జె.శ్యామ్ కుమార్ విమర్శించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నా గురువారం కూడా కొనసాగింది. ఈ ధర్నానుద్దేశించి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నచిన్న వ్యాపారాలు చేస్తున్న అనేకమంది పేద, మాధ్యతరగతి ప్రజలు అగ్రిగోల్డ్‌లో తమ డబ్బులు దాచుకున్నారని చెప్పారు. వందలాదిమంది ఏజెంట్లు, డిపాజిట్‌దారులు ఆవేదన అర్ధం చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని ఆరోపించారు. అగ్రిగోల్డ్ ఆస్తులను వాస్తవ విలువ మేరకు మదింపుచేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆ ఆస్తులను వేలంలో విక్రయించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తుల విలువమందిపులో విలువను తక్కువ చేయడం ద్వారా వాటిని కాజేయాలని కొందరు పెద్దలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడాన్ని చూస్తూ ఊరుకోమని, బిజెపి చేపట్టిన ధర్నాలతో పెద్దలు ఉలిక్కిపడుతున్నారని అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బిజెపి అండగా ఉంటుందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను నిర్లక్ష్యం చేస్తే రానున్న ఎన్నికల్లో టిడిపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బాధితులకు అండగా బిజెపి ఆధ్వర్యంలో విశాఖలో జరిగే సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెద్దింటి జగన్మోహన్‌రావు, అచ్చిరెడ్డి, అశోక్, రమణమ్మ, దేవర ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### తెలుగు వెలుగులు

తెలుగు నేర్చుకో చిన్నా...
నీ పిన్న నాటినుండే...
అమ్మ బాష అమృతమురా... కన్నా
తేనెల మాధుర్యపు జలనిధి యిది
యాబది ఆరు అక్షరాల మంజీరనాదం
అక్షయ బాషా గరిమతో ప్రకాశించే రసవేదం
పద్యపద పంక్తుల సోయగాలు
సామవేద జీవనదీఝరులు
అజరామరమైన అవధాన సంపద మన సొంతం
సాంకేతికంగా ఎంత సాధించినా... భాషోద్ధరణే బహు ముఖ్యం
తెలుగు ఘనతను దశ దిశల చాటుదాం
తెలుగు తేజపు ప్రతీకలుగా నిలుద్దాం.

... రచన
కెవిఎస్.నరసింహం

## సమస్యల పరిష్కారం కోసమే గ్రామదర్శి



మాట్లాడుతున్న ఎంపిపి చిన్నయ్యమ్మ

మాకవరపాలెం : సమస్యల పరిష్కారం కోసమే గ్రామదర్శి కార్యక్రమ లక్ష్యమని ఎంపిపి రుత్తల చిన్నయ్యమ్మ అన్నారు. మాకవరపాలెం పంచాయతీలో కార్యాలయంలో గ్రామదర్శి నిర్వహించారు. ముందుగా 15వ నెంబరు రేషన్ డిపోను, 1వ నెంబరు అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించారు.

ఈ సంద ర్భంగా జరిగిన సమా వేశంలో ఎంపిపి మాట్లాడుతూ గ్రామంలో సమ స్యలు పరిష్కరించడానికి గ్రామదర్శి ముఖ్య ఉద్దేశ్య మన్నారు. అందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిడిఒ ఎం.ఉదయశ్రీ, ఈఒపి ఆర్‌డి లగుడు అప్పల శివరామ్, హెచ్‌ఎం రాజు, ఎంఇఒ సాయిశైలజ, ఐసిడిఎస్ అధికారులు, ఆర్‌ఐ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

## పంచాంగం

మాసం : ఆశ్వయుజ; తిథి : విదియ రా.8.57; భరణి ఉ.10.35; రా.వ.10.25ల 11.59

శుక్రవారం 26-10-2018

a **మేషం** : ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

b **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యక్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవటానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు.

c **మిథునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిరచరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదురవుతుంది.శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్రం ధనం బాగా ఖర్చు చేశారు.

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం.

e **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థనలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి.

f **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభమవుతాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యాదూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది.

g **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది.

h **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది.

i **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకుతనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది.

j **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవుతారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది.

k **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

k **మీనం** :దైవ పుణ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన పనులు మీరే చేసుకోవడం మంచిది. రాజకీయాల్లోని వారికి శత్రువులు అధికమవుతున్నారని గమనించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



కంచరపాలెం: జీవీఎంసీ 41 వ వార్డు పరిది ఐ .టి .ఐ కూడలి వద్ద 42 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి రోడ్ నిర్మాణపనులకు టీడీపి వార్డు అద్యక్షుడు పెంట కోట త్రినాద్ రావు గురువారం ఉదయం శంకుస్థాపన చేశారు.

ఈ మేరకు శ్రీరామ్ నగర్ వద్ద 20 లక్షల వ్యయంతో సి.సి రోడ్‌లు, శ్యామ్ నగర్ వద్ద 22 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి రోడ్ నిర్మాణ పనులకు సంబందించి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు అదేశాల మేరకు శంకుస్థాపన చేశామన్నారు.

కార్యక్రమంలో జీవీఎంసీ ఎ.ఈ మణికుమార్, వర్క ఇనస్పెక్టర్ గణేష్, టీడీపి వార్డు నాయకులు అజయ్ బాబు, కార్తీక్ కుట్టా , స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్యం బాగుండాలని బాబాగుడిలో పూజలు



భీముని పట్టణము : విశాఖ ఎయిర్పోర్ట్ లో జననేత జగనన్న పై జరిగిన దాడిని ఖండిస్తూ తగరపువలస అంబేద్కర్ విగ్రహం వద్ద మరియు కొమ్మాది వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలియజేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త అక్కర మాని విజయనిర్మల మాట్లాడుతూ జన హృదయ నేత జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర లో వస్తున్న స్పందన చూసి ఓర్వలేక అధికార పార్టీ తెలుగుదేశం నాయకులు ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం దారుణమని అదే విధంగా ఈ హత్యాయత్నానికి ప్రయత్నించినా శ్రీనివాస్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ కేసును సిబిఐకి విచారణకు జరిపించాలనిడిమాండ్ చేశారు అదే విధంగా తగరపువలస సాయిబాబా దేవాలయం లో జగనన్న ఆర్యోగం బావుండలి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి పట్టణ అధ్యక్షులు వెంకట్రావు మరియు భీమిలిరూరల్ బోనీబంగారు నాయుడు జివియంసి 5వ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్.జగన్‌పై దాడి దురదృష్టకరం

విజయనగరం : వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు, రాష్ట్ర ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై విశాఖ ఎయిర్ పోర్టులో ఒక వ్యక్తి కత్తితో దాడిచేయడం చాలా దురదృష్టకరమని, ఇటువంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యడ్ల ఆదిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్టు అంతా కేంద్ర బలగాల ఆదీనంలో ఉంటుందని ఏకంగా ఎయిర్‌పోర్టు విఐపి లాంజ్‌లోనే ఇటువంటి దాడి జరిందంటే భద్రత ఏమేరకు పర్యవేక్షణ జరుగుతుందనేది తేటతెల్లమవు తుందన్నారు.

దీనిపై సమగ్రమైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి హింసకు తావులేదని, దీనిని అందరూ ఖండించవలసిన అవసరం ఉందన్నారు.

## శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

### సంకీర్తన

ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామినాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిని తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుబ్రమహ్మణ్యేశ్వరుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తించునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్ర హ్మణ్య షష్టిరోజున వేకువ జామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్ర హ్మణ్యేశ్వరునికి సమర్పిం చడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగ లిపినది) తయా రుచేసి, కొబ్బరి కాయలు, అరటి పళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలు దేరుతారు. సుబ్ర హ్మణ్యేశ్వరుడు సర్పా కారుడు కావ డంవల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శుద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గులతో అలం కరిస్తారు. అనంతరం, పాలు కోడి



గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబంధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు. అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహాద్భా గ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లి విరి యాలని మనసావాచా అందరూ పూజిస్తారు. పార్వతీ పరమేశ్వరుల ప్రేమకు, అనుగ్రహానికి ఐక్యరూపం సుబ్రహ్మణ్య స్వామి. స్వామి అనే నాయ ధేయం కేవలం సుబ్రహ్మణ్యానికి సొంతం. దేవ సేనాధిపతిగా, సకల దేవగణాల చేత పూజ లందుకునే దైవం కుమారస్వామి అని పురాణాలు చెబు తున్నాయి. అలాంటి షణ్ముఖుని అనుగ్రహం పొందగలిగితే స్కంద పంచమి, కుమార షష్టి రోజున స్వామని పూజించాలి. కుమారస్వామని పూజిస్తే గౌరీశంకరుల కటాక్షం మనకు లభించినట్టేనని పురాణాలు చెబుతున్నాయి. శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు.

జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వదించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫుటమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ఆర్యవైశ్య వివాహ
పరిచయ వేదిక
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్య కులస్థుల వివాహ పరిచయ వేదికలో పాలు పంచుకునే వారు సంప్రదించండి
అక్టోబరు 28, ఆదివారం

రిజిస్ట్రేషన్లకు చివరి తేది : 25-10-18
ఉమియా భవన్ కళ్యాణ మండపం
సుబ్రహ్మణ్య స్వామి గుడి ఎదురుగా
ఎన్.ఎ.డి జంక్షన్, విశాఖపట్నం
98491 03826
80741 93882
Email : vasavivivahaparichayavedhika@gmail.com

DMK ITI (p)
TRADES: Electrician & Fitter Scholorship for Eligible Candidates
Note: అతి తక్కువ ఫీజులకు సీటు ఇవ్వబడును
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contract: 83090 08289

APOSS (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ స్కూల్)
Direct: SSC & Inter ( Any group ) One Sitting pass Guarantee, DMK Junior College, Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

SREE KUSUMA HARANATH COLLEGE OF EDUCTION (D.ED.,)
2017-19 Batch సీట్లు అతి తక్కువ ఫీజులకు ( 1 సం. కలిసొచ్చును )
2017-19 Batch సీట్లు కూడా అతి తక్కువ ఫీజులకు ఇవ్వబడును.
Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

# వైభవంగా పీలా వారి గౌరమ్మ విగ్రహప్రతిష్ఠ



అనకాపల్లి : పట్టణంలో గవరపాలెం గంగిరావిచెట్టు సమీపంలో గల పీలా వారి శ్రీ గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది.

గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలలో భాగంగా, ప్రతీ ఏటా మాదిరిగా, ఈ ఏడాది పౌర్ణమి రోజు మేళాతాళలతో మంగళ వాయిద్యాలతో గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఊరేగింపుగా దిబ్బవీధి నుండి, విగ్రహాలను స్వయంగా మోసుకుని, తీసుకువచ్చారు.

అమ్మవారిని ఊరేగింపుగా తీసుకురావడానికి భక్తులు పోటీ పడ్డారు. దారి పొడువునా గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను భక్తులు దర్శించుకుని తరించారు.

భీమరశెట్టి వరహా, బుద్ధ శ్రీను, భీమరశెట్టిశ్రీను, ఉమ, బలరాం, మహిళలు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

కొయ్యూరుః తెగుళ్ల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి ఎస్.విజయలక్ష్మి అన్నారు. ఆడాకుల, బకులూరు పంచాయతీల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరి పంటను పరిశీలించారు. పంటలకు తెగుళ్లు సోకడాన్ని గుర్తించిన ఆమె నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వరిలో పాముపొడ, దోమపోటు, ఆకు ముడత తెగుళ్లు ఉన్నాయన్నారు. పాముపొడ తెగులు నివారణకు ట్రైసైక్లోజెల్, హెక్సాకోనజెల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. సుడిదోమకు ఇజ్‌పెన్ పాల్స్ 1.3 ఎంఎల్‌ను పైపటిజల్ 0.6 ఎంజితో లీటరు నీటితో కలిపి ఆకుకిందన తగిలే విధంగా పిచికారీ చేయాలన్నారు. ఆకుముడతకు క్లోరోపైరిపాస్ రెండు ఎంఎల్ లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి ఎండిపోయే దశలో ఉంటే యూరియాను ఐదు శాతం నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

### 28వవార్డు కుమ్మరవీధిలో
# అన్న సమారాధన

విశాఖపట్నం: దేవి నవరాత్రోత్సవాలు ముగింపు సందర్భంగా దక్షిణ నియోజకవర్గం 28వవార్డు కుమ్మరవీధిలో గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ దుర్గా ఉత్సవ్ కమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిదిరోజుల పాటు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలందరూ, పలు ప్రాంతాల ప్రజలతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్ద రాజశేఖరరెడ్డి, చిరంజీవి, వాసు, వెంకట్, జగదీష్, రాజేష్, గణేష్, శ్రీనివాస్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌పై హత్యాయత్నంకు నిరసనగా ఆందోళన



రోడ్డు పై బైటాయించి ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

నర్సీపట్నం : జగన్‌పై విశాఖ ఎయిర్ పోర్టులో జరిగిన హత్యాయత్నంపై నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పెట్ల ఉమాశంకరగణేష్ ఆధ్వర్యంలో నర్సీపట్నం గురువారం మధ్యాహ్నం భారీ ఆందోళన చేపట్టారు. ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి శ్రీకన్య జంక్షన్ వద్ద బైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ వైయస్.జగన్‌పై దాడి చేయడం అమానుషమన్నారు. దాడికి తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో నర్సీపట్నం వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, మండలంలోని వైసిపి నాయకులు, కౌన్సిలర్లు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్ పై దాడి ప్రభుత్వ వైఫల్యం
### జనసేన నాయకులు సీతారాం



అనకాపల్లి : విశాఖ ఎయిర్ పోర్టులో ప్రతిపక్ష నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి మీద జరిగిన దాడిని పూర్తిగా ప్రభుత్వ వైఫల్యంగా భావించక తప్పదని జనసేన నియోజక వర్గ నాయకులు కొణతాల సీతారాం అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం మొత్తం సీఐఎస్ఎఫ్ మీదకు నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో జగన్మోహన్ రెడ్డి విశాఖలో దీక్ష చేయడానికి వచ్చిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు ఎయిర్ పోర్టులోకి ఎలా వెళ్లారో ఇప్పుడు చంద్రబాబు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ నేవీ ఆధీనంలో ఉన్న విశాఖ ఎయిర్ పోర్టులోకి ఒక వ్యక్తి మారణా యుధంతో ప్రవేశించడానికి వెనుక ఉన్న శక్తులు ఏవనేది వెంటనే కనుగొనాలని డిమాండ్ చేశారు. ఈ చర్యను ప్రభుత్వం వక్రీకరించడం మాని ప్రతిపక్ష నేత భద్రత విషయంలో వచ్చిన తేడాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీతారాం కోరారు.

## నేడు హలో గురు ప్రేమ కోసం యూనిట్ రాక



అనకాపల్లి : పట్టణానికి శుక్రవారం హలో గురు ప్రేమకోసం సినిమా యూనిట్ వస్తున్నట్లు తెలుగుదేశంపార్టీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర తెలిపారు. స్థానిక షిరిడిసాయి, పర్తి సాయి థియోటర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లికి చెందిన నక్కిన త్రినాధ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రాన్ని ప్రేక్షకులు అపూర్వంగా ఆదరించారన్నారు. మంచి కలెక్షన్స్ వస్తున్నాయన్నారు. అందులో భాగంగా సినిమా యూనిట్ అంతా శుక్రవారం పర్యటనలో భాగంగా అనకాపల్లి వస్తున్నట్లు చెప్పారు. ముందుగా, నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటారని అనంతరం అభిమానులను, సినిమా ప్రేక్షకులతో మాట్లాడతారని చెప్పారు. అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేసి వారికి స్వాగతం పలకవలసిందిగా ఈ సందర్భంగా సురేంద్ర కోరారు. ఈకార్యక్రమంలో సురేంద్రతోపాటు సినిమా థియేటర్ నిర్వాహకులు నీలగిరి శ్రీనివాసరావు, డివిడి సత్యనారాయణ, గోల్డ్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యల పరిష్కారంకు గ్రామదర్శి



మాట్లాడుతున్న నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు

గొలుగొండ : గ్రామాల్లో సమస్యల పరిష్కారంకు గ్రామదర్శి ముఖ్య ఉద్దేశ్యమనినర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు అన్నారు. గురువారం పప్పుశెట్టిపాలెం గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం జరిగింది. ముందుగా రేషన్ దుకాణాలు, పాఠశాలలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అప్పల నాయుడు మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులు సవరణ చేసుకోవడానికి బిఎల్‌ఒలను కలవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిడిఒ సువర్ణరాజు, ఇరిగేషన్ జెఇ రామన్న పాత్రుడు, వెలుగు ఏపియం రమణకుమారి, వ్యవ సాయ అధికారి మధుసూదనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, డిటి ఆనంద్, ఈఒపిఆర్‌డి త్రిమూర్తులు, పశువైద్యాధికారిని అశ్విని, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, పంచాయతీ కార్యదర్శి రమణ, టిడిపి మండల యూత్ అధ్యక్షులు బెల్లపు కొండలరావు, మాజీ సర్పంచ్ బి. రాజులమ్మ, పలు మండల శాఖలా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో
# ఎమ్మెల్యే పంచకర్ల గ్రామదర్శి



యలమంచిలి రూరల్ : రాంబిల్లి మండలములోని కొత్తూరు మరియు హరిపురం గ్రామంలో తెలుగు దేశం పార్టీ చేపట్టిన గ్రామ దర్శిని- గ్రామ వికాసం'' కార్యక్రమములో యలమంచిలి ఎమ్మెల్యే, విశాఖ (రూరల్) జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు పర్యటించినారు. ఈకార్యక్రమంలో భాగంగా హరిపురం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామంలో రూ.5లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న కళ్యాణ మండపంనకు శంఖుస్థాపన చేశారు. అనంతరం హరిపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీలోకి నూతనంగా చేరిన ధూళి వెంకటరమణ, ధూళి లోవరాజు, ధూళి వెంకటప్ప రావు గణపతి, అప్పలనానాజీ, పలువురు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు అనిత తిరుపతి రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ధూళి రంగనాయకులు, మండల పార్టీ అధ్యక్షులు దిని బాబు, మాజీ సర్పంచులు, వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైయస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా వైకాపా రాస్తారోకో



గాజువాక: విశాఖ ఎయిర్‌పోర్టులో రాష్ట్ర ప్రతిపక్షనేత, వైకాపా రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా పారిశ్రామికప్రాంతం లోని వైకాపా శ్రేణులు గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మల్కాపురం ప్రధాన రహదారి వద్ద వాహనాలను ఆపి దాడిని ఖండిస్తూ హత్యాత్నానికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలంటూ నినాదాలు చేసారు. ఈ సంధర్భంగా వైకాపా శ్రేణులు మట్లాడుతూ వైయస్‌జగన్ కు ఎటువంటి అపాయం తలపెట్టిన చూస్తూ ఊరుకోమని అన్నారు. రాష్ట్ర ప్రతిపక్షనేత వైయస్‌జగన్ తను చేపట్టి ప్రజాసంకల్పయాత్రను ముగించుకొని హైదరాబద్‌కు వెళుతున్న సంధర్భంలో ఎయిర్‌పోర్టులోని ఒక రెస్టారెంట్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ అనే యువకుడు సెల్ఫీ తీసుకుంటానని చెప్పి జగన్‌పై కత్తితో దాడికి పాల్పడడం అత్యంతదారుణమని, దీని వెనుక పెద్ద కుట్రదాగివుందని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ దారుణానికి వడికట్టిన వారిని ఎంతటివారినైన విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. అధికార ప్రభుత్వం ఇటువంటివి ప్రోత్సహిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# ఈనెల 27, 28 తేదీల్లో వాస్తుపై వర్క్‌షాప్

విశాఖపట్నం : వాస్తు లోపాలున్న హౌసింగ్ ప్రాజెక్టులు, వ్యవసాయ కర్మాగారాలు, నూతన నిర్మాణాలు, వ్యాపార కాంప్లెక్స్‌ల రూపకల్పనకు వాస్తు జ్ఞానంపై అవగాహన అందించేందుకు ఈనెల 27, 28 తేదీలలో రెండురోజుల పాటు విశాఖలో ఆర్టీవో కార్యాలయం దరి మ్యారేట్ హోటల్‌లో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు అధునాతన పారిశ్రామిక వాస్తు కేంద్రం అధినేత ఎన్.రఘుపతిరాజు అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ ఇండస్ట్రియల్ వాస్తు సెంటర్‌ను విశాఖలో ప్రారంభించడం ఆనందంగా వుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చా కార్యదర్శి మరియు మాజీ రాష్ట్ర అధ్యక్షులైన శరణాల మాలతీరాణి, డాక్టర్ విక్రమాధిత్య, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## అడివివరం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో స్వైన్‌ఫ్లూ పై అవగహన కార్యక్రమం



సింహాచలం: 72 వ వార్డ్ పరిధి సింహాచలం గ్రామీణ ఆరోగ్యం కేంద్రంలో సైన్ ఫ్లూ పై అవగాహన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ ప్రసాద్ ఎపిడెమిక్ ఇంచార్జ్ ఆశ వర్కర్స్ ఏఎన్‌ఎంలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు సైన్ ఫ్లూ నిర్ధారణకు అంగుటి పూత పరీక్ష టెస్టింగ్ పంపి నిర్ధారణ జరిగిన తర్వాత వీరి కోసం టిబి హాస్పిటల్ నందు కేజీహెచ్ నందు ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని వైరస్ లక్షణాలు ఉన్నవారు నోటికి మాస్ కు ధరించాలని సూచించారు వీరితో పాటు వైరస్ లక్షణాలు ఉన్న వారితో పాటు వారి ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రదేశాలు ఉన్నవారు కూడా మార్కుల గురించి మాస్కులు ధరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ వ్యాధి ఉన్నవారు లక్షణాలు ఏ విధమైన భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని దీనికి చికిత్స ద్వారా ఐన చేయవచ్చని. ఈ కార్యక్రమంలో గ్రామీణ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎమ్ పి జగదీష్ డాక్టర్ మురళీధర్ డి ఎల్ వో రమేష్ హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ సూపర్వైజర్ శ్రీనివాస రావు పుష్ప రాజు ఏఎన్ఎంలు ఆశ వర్కర్స్ పాల్గొన్నారు

### విశాఖపట్నం ఫింటెక్ ఫెస్టివల్‌లో సందడి చేసిన
# మొదటి హ్యూమనాయిడ్ రోబో సోఫియా...
### మంత్రి నారా లోకేష్ ...సోఫియా మధ్య ఆసక్తికర చర్చ...

విశాఖపట్నం : మనుషులు,రోబోలు కలిసి సామరస్య వాతావరణంలో ఉండటం సాధ్యం అవుతుందా అని మంత్రి లోకేష్ అడిగిన ప్రశ్నకి సమాధానం ఇచ్చిన సోఫియా రోబోలు మనుషులకు మరింత దగ్గర అయ్యే రోజులు వస్తున్నాయి...అనేక రంగాల్లో రోబోలు మనుషులకు సహకారం అందించే అవకాశాలు ఉన్నాయి.మెడికల్ థెరపీ తో సహా అనేక రంగాల్లో రోబోలు అనేక సేవలు అందించే అవకాశం ఉంది.

పోలీసింగ్ కోసం ప్రభుత్వం రోబోలు ఉపయోగించే అవకాశం ఉందా అని మంత్రి నారా లోకేష్ ని అడిగిన సోఫియా ఒక్కప్పుడు రోబో కాప్స్ అనేది ఊహజనితం.కానీ పెరుగుతున్న టెక్నాలజీ తో త్వరలోనే రోబో పోలీసింగ్ నిజం అయ్యే రోజులు దగ్గర ఉన్నాయి...

నిఘా కోసం రోబో కాప్స్ వినియోగించే అవకాశాలు ఉన్నాయి... మీ విజన్ చూసిన తరువాత ఒక విజన్ ఉన్న నాయకుడు అని అర్థం అయ్యింది.మీ ఆలోచనలు చుస్తే మీ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది అని అనుకుంటున్నాను అని అన్న సోఫియా మా ప్రయాణం ఇప్పుడే మొదల య్యింది.2050 కి ప్రపంచంతో పోటీ పడాలి అని లక్ష్యంగా పెట్టుకున్నాం...పెట్టుబడులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే ఉత్తమ వేదికగా మార్చాలి అని పనిచేస్తున్నాం అని సోఫియాతో అన్న మంత్రి లోకేష్ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన సోఫియా తిత్లీ లాంటి విపత్తులు వచ్చినప్పుడు రోబోలు ఉపయోగ పడతాయా?విపత్తులు వచ్చినప్పుడు నువ్వు ప్రాణ త్యాగం చేస్తావా అని అడిగిన ప్రశ్నకు ప్రస్తుతం విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం నాకు లేదు...

కానీ జరుగుతున్న అభివృద్ధి వలన రానున్న రోజుల్లో ఇది సాధ్యం అవుతుంది.

విపత్తులు వచ్చినప్పుడు ప్రజల ప్రాణాలు కాపాడటానికి నేను సిద్ధంగా ఉన్నా.. విశాఖపట్నం రావడం ,ఫింటెక్ ఫెస్టివల్ లో పాల్గొనడం ఎలా ఉంది. విశాఖపట్నం రావడం చాలా సంతోషంగా ఉంది...త్వరలోనే మళ్లీ విశాఖ వస్తాను.

### సిండికేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో
# రక్తదాన శిబిరం



విశాఖపట్నం: స్థానిక సిండికేట్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో బ్యాంక్ 93వ వ్యవస్థాపక వార్షిక దినోత్సవం సందర్భంగా గురువారం బ్యాంక్ ఆవరణలో రక్తదానం చేశారని రీజనల్ మేనేజర్ ఎం.విజయబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM.
I.A. 70/2016 IN O.S. 21/2016

Between
Garaga Anasuya ...Plaintiff
And
Kosuru Dwarakanadh ...Defendant
To
Kosuru Dwarakanadh,
S/o.Not Known, Hindu, 50yrs,
Business,
r/at. D.No: 8-4-18/8,
Prasanthinagar
Pedawaltair
Visakhapatnam-17.

**NOTICE**

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన Garaga Anasuya, W/o(L) Narayana Rao గారు మీ మీద "ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో" O.S.21/2016 అనే Injunction దావా వేసినారు. సదరు దావాలో కోర్టు ద్వారా మీకు చాలాసార్లు నోటీసులు పంపించిన అవి తిరిగి రావడం వలన కోర్టు వారు ఆర్డరు ప్రకారం మీకు ఈ ప్రకటన ద్వారా ఈ నోటీసును ఇవ్వడమైనది. పై దావా తేదీ:**05-11-2018**న పై కోర్టులో వాయిదా అయ్యి వున్నది. కావున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో **05-11-2018**న హాజరు అయ్యి మీ తరపున వాదనను తెలియజేసుకోవలెను. లేనిచో మీ పరోక్షంలో శ్రీ కోర్టు వారు మా క్లయింట్‌కి డిక్రీ ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

By Order
Sri.M.V.Parvateesam
(పిటీషనర్ తరపు న్యాయవాది)
భీమునిపట్నం.

Bheemunipatnam
Dt: 25/10/18

# జగన్మోహన్ రెడ్డిపై దాడికి నిరసనగా ర్యాలీ



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో జగన్ మోహన్ రెడ్డి గారిపై జరిగిన దాడికి నిరసనగా అన్నవరంలో వైయస్ఆర్ సీపీ నాయకులు ధర్నా చేశారు ఆయన ఆరోగ్యం బాగుండాలని సత్యదేవుని తొలిపావాంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి సత్యదేవున్ని ఆయన ఆరోగ్యం బాగుండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం వైసిపి టౌన్ అధ్యక్షుడు రాయవరపు. బాస్కరరావు, జిల్లా వైసీపీ ఎస్సీ,ఎస్టీ సెల్ పార్లమెంటరీ విభాగం అధ్యే శెట్టిబత్తుల.కుమార్ రాజా, బొబ్బరాడ. సత్య వర్రపసాద్, కొండపల్లి. అప్పారావు, బొబ్బిలి.వెంకన్నబాబు, బండారు. అర్జునరావు, తాటిపాక.కృష్ణ, తాడి. సత్యన్నారాయణ, పలివెల.కొండలరావు, సరమర్ల. మధుబాబు, రాయి.శ్రీను, దడాల.సతీష్ తదితరులు పాల్గొన్నారు

# జనసేన పార్టీ పట్ల పెరుగుతున్న ఆదరణ



కొత్తపల్లి : మండలంలోని కోన పాప పేట గ్రామంలో గురువారం పిఠాపురం జనసేన పార్టీ నాయకుడు తేలగంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన యువకులు పేద వృద్ధులకు సుమారు 150 దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే నాలుగు వందల మంది యువకులు ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేలగంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినాయకుడు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాల పట్ల యువకులు, స్త్రీలు, కార్మికులు, పేదలు, ఆకర్షితులయ్యారు అని తెలిపారు. పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో రేషన్ బదులుగా మహిళల ఎకౌంటు లో రూ 2500 నుంచి 3500 వరకు వారి ఎకౌంటులో ప్రతి నెల జమ కాపాడుతుందని అలాగే గ్యాస్ సిలెండర్ ఫ్రీగా ఇవ్వనున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారని చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఎస్సీ వర్గీకరణతో పాటు అగ్రవర్ణాలలో పేదలైన వారికి రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బాపన్న దొర, కంబాల దాసు, మధు, వడ్డీ రాజేషు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌పై జరిగిన దాడికి నిరసనగా ర్యాలి



రావులపాలెం: రాష్ట్ర వైఎస్సార్సీపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా రావులపాలెం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. గురువారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక కళా వెంకట్రావు విగ్రహం వద్ద జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేసారు. ముందుగా పార్టీ కార్యాలయం వద్దనుండి జాతీయ రహదారి మీదుగా రావులపాడు జయశ్రీ ఆసుపత్రి వరకు నినాదాలు చేసుకుంటూ నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భముగా నాయకులు మాట్లాడుతూ వైజాగ్ ఎయిర్‌పోర్టులో తమ నేతపై జరిగిన హత్యాయత్నంపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండు చేసారు. ఈ కార్యక్రమంలో కర్రి నాగిరెడ్డి, ఎమ్‌పిపి కోట చెల్లయ్య, జెడ్‌పిటిసి సాకా ప్రసన్నకుమార్, వైస్ ఎమ్‌పిపి దండు వెంకట సుబ్రహ్మణవర్మ, గొలుగూరి మునిరెడ్డి, కప్పల నాగేశ్వరరావు, కొండేపూడి రామకృష్ణ, బొక్కా వెంకటలక్ష్మి, వైసిపి శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డిపై దాడిచేసిన వ్యక్తినీ కఠినంగా శిక్షంచాలి

## మండల వైసిపి అద్యక్షులు సిరపురపు

పరవాడ: రాష్ట్ర ప్రతిపక్ష నాయకులు, వైసిపి పార్టి అద్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పై దాడిచేసిన శ్రీనువాస్‌ను కఠినంగా శిక్షించాలి అని పరవాడ మండల వైసిపి పార్టి అద్యక్షులు సిరపురపు అప్పలనాయుడు డిమాండ్ చేసారు. గురువారము అయన స్దానిక వైసిపి కార్యలయంలో ఎర్పాటు చేసిన విలేఖర్లు సమావేశంలో అయన మాట్లడుతూ విశాఖ ఎయిర్ పోర్టులో పార్టి అద్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పై జరిగిన హత్యాయత్నాన్ని పరవాడ మండల వైసిపి నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి యూత్ అద్యక్షులు పెదిశెట్టి శేఖర్, పైల అప్పలనాయుడు, స్కూల్ కమిటి చైర్మన్ పైలహరేష్, పైలఅప్పలనాయుడు ( జూనియర్ ), బొద్దపుచిన్నారావు తదితర్లు పోల్గోన్నారు.

# వైద్య విధానాలపై అవగాహన కల్పించు కోవాలి:

### జెసి డా.మల్లిఖార్జున



కాకినాడ : ఆధునికతతో కూడిన వైద్యవిదానాలపై అవగాహన కల్పించు కోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున అన్నారు. రంగరాయ వైద్య కళాశాల 75వసంతాల వేడుకలలో భాగంగా కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన ప్రదర్శనను గురువారం జెసి.డా.మల్లిఖార్జున ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల ఏర్పాటు చేసిన మానవశారీర ఆకృతులు ,అవయవ నిర్మాణం,వ్యాధులు,నిర్ధారణ,నివారణ ఇతర అంశాలపై వైద్య విద్యార్ధులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్యవిధానంలో వస్తున్న మార్పులు శాస్త్ర విజ్ఞానం, మానవ శరీర నిర్మాణం తదితర అంశాలలో అవగాహన కల్పించుకొనేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహద పడతాయన్నారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేసిన కళాశాల యాజమాజ్యాన్ని జాయింట్ కలెక్టర్ అభినందించారు. రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.మహాలక్ష్మి మాట్లాడుతూ వజ్రంగ్ పేరుతో నిర్వహించే ఈ విజ్ఞాన ప్రదర్శన నేటి నుండి నవంబరు 5వరకు ఉదయం 10గంటల నుండి సాయంత్రం5 గంటలవరకు ఉంటుందన్నారు.వివిధ అంశాలపై ప్రజలకు అర్ధమయ్యే రీతిలో స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రదర్శనను విద్యార్ధులు, ప్రజలు తిలకించి వైద్య విధానాలపట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా గైనకాలజీ హెచ్‌వోడి డా.లావణ్య కుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో గర్భిణీలకు కాన్పు కష్టమైనప్పుడుశస్త్రచికిత్సచేసి తల్లి ,బిడ్డను వేరు పరచడం, సాధారణ శస్త్ర చికిత్స, శిశు జననం, గర్భ కోస వ్యాధులు తదితర అంశాలను జెసికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.డిఎస్ ఆర్ . మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఎం. రాఘవేంద్రరావు, కార్యక్రమ ఛీఫ్ కో-ఆర్డినేటర్ డా.సుధీర్, ప్రదర్శన నిర్వాహక కార్యదర్శి డా.సౌభాగ్యలక్ష్మి, డా. ప్రభోద్ కుమార్,డా.గిరి డా.రామ్మోహనరావు,డా.నరసింహారావు,డా.శర్మ,సమాచార శాఖ ఉపసంచాలకులుయం. ప్రాన్సిస్ ,ఎడి.శ్రీనివాస కుమార్ పలువురు వైద్యనిపుణులు, వైద్య విద్యార్దులు పాల్గొన్నారు.

# తిత్లి బాదితులకు కిట్లు పంపిణి

రావులపాలెం : ఇటీవల సంభవించిన తుఫాను బాదితులకు మానవతా దృక్పదంతో మేమున్నాం అంటూ బరోసా కల్పిస్తూ తమ వంతు సహకారాన్ని ఫిలిప్ ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. గురువారం స్థానిక ఫిలిప్ ఫెయిత్ మినిస్ట్రీస్ పాస్టర్ జాషువా బెన్హర్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, పలాస పరిసర ప్రాంతాల ప్రజలకు మేమున్నాం అంటూ రెండు లక్షలు విలువగల బియ్యం, బట్టలు, కందిపప్పు, వాటర్ బాటిల్స్‌ను లారీలో సహాయంతో తీసుకువెళ్ళి అల్లకల్లోలం సృష్టించిన తిత్లి తుఫాను బాదితులకు అందించారు. ఈ సందర్భముగా జాషువా బెన్హర్ మాట్లాడుతూ తిత్లి తుఫాను కారణంగా ఆస్థి నష్టం, ప్రాణ నష్టం సంభవించి బాదితులు వీధిన పడ్డారని, జరిగిన సంఘటనకు రాష్ట్ర వ్యాప్తంగా విచారాన్ని వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఎర్నెస్ట్‌పాల్, మోకా సూర్యనారాయణ, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# కనుమరుగవుతున్న కళలో గంగిరెద్దుల ఆట



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో గురువారం సాంప్రదాయ బద్ధమైన గంగిరెద్దులు ఆట గ్రామ ప్రజలను కనువిందు చేసింది. ఇది చూడటానికి పిల్లలు, పెద్దలు ఎంతో ఆశక్తి కనపరుస్తూ గంగిరెద్దు ఆటలను తిలకించారు. అయితే సర్వసాధారణంగా గంగిరెద్దుల ఆట సంక్రాంతి సమయంలో కనుపించే ఒక గ్రామీణ సాంస్కృతిక కళారూపం మరియు వినోదం. అలంకరించిన గంగిరెద్దులను ఇంటింటికీ తిప్పుతూ, డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత చేయించే నృత్యాలు చూడటానికి చాలా రమణీయంగా ఉంటాయి. అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుల వాళ్ళు సందడి చేస్తూ ధాన్యం, ధనం వంటి బహుమతులు తీసుకొంటుంటారు.

# నవంబర్ 2 నుండి శ్రీ సత్యదేవ దీక్షలు

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ సత్యదేవునికి అనగా హరిహరాధులకు కార్తీకమాసము చాలా ప్రీతికరమని, పవిత్రమైనదని కావున ఈ మాసమునందు శ్రీ సత్యదేవ దీక్ష ఆచరించిన దీక్ష ప్రతాదులకు విశేష ఫలితమని పురాణములు చెప్పుచున్నవి. కార్తీకమాసము నందు క్షిరాబ్ది ద్వాదశి రోజున (ఉత్తాన ఏకాదశి)శ్రీ మహావిష్ణువు పాల సముద్రము నుండి బృందావనమునకు (తులసీవనం) ప్రవేశ సమయము కావున ఆ కాలము నందు చేసిన దీక్ష వ్రతాదులకు అత్యంత పుణ్య ఫలదాయకం మరియు విష్ణుమూర్తి తినే స్వయంగా దీక్షను స్వీకరించిన భక్తులు కోరిన కోర్కెలు నెరవేర్చును. కావున ఈ ఆలయంలో అనగా సత్యదేవుని ఆలయంలో శీ సత్య దీక్షలు నవంబర్ 2వ తేదీ నుండి ప్రారంభమై 30వ తారీఖు వరకు అనగా 27 రోజులు అలాగే 18రోజుల దీక్ష 11వ తేదీ నుండి 30వ తేదీ వరకు కలదు.కావున శీ సత్య దీక్ష పరులకు దేవస్థానం వారిచే సత్యదీక్ష వస్త్రములు ఉచితంగా బుధవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎమ్.జితేంద్ర,పిఆర్వో తులా.రాముడు చేతుల మీదుగా పంపిణీ చేసారు. అంతే కాకుండా ఇక్కడ ఆలయంలో కార్తీక పౌర్ణమి రోజున శ్రీ స్వామివారితో గిరి ప్రదక్షిణ మరియు జ్వాలా తోరణం ప్రవేశము చేయడము వలన మానవుడు చేసిన పాపములు అన్నియూ నసించి పునీతులు అవుదురని పురాణములయందు చెప్పుచున్నవి.

# టీడీపీ పరిపాలనలో విద్యార్థుల సంక్షేమం ఎండమావి

### - డాక్టర్ విజయప్రసాద్ మళ్ల డిమాండ్



విశాఖపట్నం: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో విద్యార్థుల సంక్షేమం ఎండమావిగా మారిందని ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్‌మెంట్‌ను నిర్వీర్యం చేశారని విశాఖ నగర వైస్సార్ సీపీ అధ్యక్షులు డాక్టర్ విజయప్రసాద్ మళ్ల విమర్శించారు. వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఫీజుపోరు పేరుతో నిరసన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు బి. కాంతారావు, నగర అధ్యక్షుడు తిప్పల వంశీరెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ర్యాలీలో పాల్గొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రియంబర్స్‌మెంట్‌ను నీరుగార్చి, కార్పొరేట్ విద్యాసంస్థలకు లాభం చేకూర్చారని ఆరోపించారు. జిల్లా వైకాపా విద్యార్థి విభాగ అధ్యక్షుడు కాంతారావు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ఆంక్షలు తొలగించాలని జిఒ నెంబర్ 72 రద్దు చేసి పేద విద్యార్థికి ఫీజు మాఫీ చేయాలని డిమండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కెకె రాజు, డాక్టర్ పి. రమణమూర్తి, తిప్పలనాగిరెడ్డి, పిల్లి చంద్రశేఖర్‌యాదవ్, కొండారాజీవ్‌గాంధీ, సనపల రవీంద్ర, భరత్, అళ్ళ గణేశ్, గడ్డం ఉమా తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# జిఎంఆర్ తొత్తులుగా మారిన జాతీయ రహదారి శాఖ అధికారులు.....

# గగ్గోలు పెడుతున్న చిన్న సన్నకారు రైతులు

కొత్తపల్లి: అన్నవరం జాతీయ రహదారి నుండి వాకలపూడి లైట్ హౌస్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సాగర్ మాల రోడ్డు చిన్న సన్నకారు రైతుల పట్ల మహమ్మారిగా మారింది ఎకరా రెండెకరాలు భూమి ఉన్న రైతులు ఈ రోడ్డు నిర్మాణం ద్వారా భూములు కోల్పోతున్నారు ఒక పక్క ఎస్సి జడ్ పేరు చెప్పి కొత్తపల్లి మండలం, తొండంగి మండలం, ఈ రెండు మండలాల్లో సుమారు తొమ్మిది వేల ఆరు వందల ఎకరాల భూములను జిఎంఆర్ కు కట్టబెట్టారు మిగిలి ఉన్న ఎకరా అరెకరా భూమి కూడా సాగర్ మాల రోడ్ వల్ల భూములు తీసుకుంటే మేం ఎలా బతకాలని రైతులు ,కూలీలు వాపోతున్నారు గురువారం అఖిలపక్ష పార్టీ నాయకులు అందరూ ఏకమై కొత్తపల్లి తాసిల్దార్ కార్యాలయానికి తాసిల్దారు కే రత్నకుమారికి వచ్చి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా జిల్లా సిపిఎం కార్యవర్గ సభ్యులు దువ్వా శేషు బాబ్జి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ఎస్సి జడ్ కు వ్యతిరేకంగా పోరాటం జరపాలని దానికి పూర్తి మద్దతు ఇస్తానని నాట్లు వేయాలని పిలుపునిచ్చారు అయితే అధికారం వచ్చిన తర్వాత ఇచ్చి హామీలు పక్కనపెట్టి జిఎంఆర్ ఇచ్చే ముడుపులు కోసం పేద ప్రజల పట్ల తన మొండి వైఖరిని చూపిస్తున్నాడు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఇరువురు జిఎంఆర్ సంస్థకు కొమ్ము కాస్తున్నాయి. ఈ రహదారి నిర్మాణంలో బడా భూస్వాములు భూముల పక్కనుంచి వెళ్తుంది తప్ప వారి భూమిలోకి ఈ రహదారి నిర్మాణం జరగకపోవడం విడ్డూరం అలాగే చిన్న సన్నకారు రైతులు భూముల లోంచి అనేక మలుపులు తిరుగుతూ రహదారి నిర్మాణం సాగుతుంది దీనివల్ల అనేక ప్రమాదాలు గురవుతాయని ప్రజలువాపోతున్నారని తాసిల్దారుకే రత్నకుమారి దృష్టికి తెలియ జేయగా ఆమె స్పందించి ఉన్నతాధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ మాజీ జెడ్ పి టి సి పెద్దాడ సుబ్బారాయుడు, జిల్లాకాంగ్రెస్ ఉపాధ్యక్షులు సాగర మాల ఉద్యమకారులు గన్ని వెంకటేశ్వరరావు చింత సూర్యనారాయణ మూర్తి మాజీసొసైటీ ప్రెసిడెంట్ మేడే రామకృష్ణ పిఠాపురం నియోజవర్గ జనసేన పార్టీ నాయకుడు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు వైకాపా నాయకులు జ్యోతుల బాబులు ఆ నాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యం



రావులపాలెం: రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహోరాత్రులు కృషిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం మండల పరిధి ముమ్మిడివరప్పాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అడపా హనుమంతరావు అధ్యక్షతన జరిగిన గ్రామదర్శిని గ్రామ వికాశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండారు హాజరయ్యారు. ముందుగా దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పథాకాన్ని ఆవిష్కరించి గ్రామదర్శిని గ్రామ వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలు అందజేసి గతంలో ఎన్నడూలేని విధంగా జరిగిన అభివృద్ధిని తెలియజేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని తూచా తప్పకుండా పాటించారని, రాష్ట్రం 16 వేల కోట్లు లోటు బడ్జెట్‌లో ఉన్నా అభివృద్ధి పథకాల అమలులో మడమ తిప్పకుండా అమలు చేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చేసి ఓర్వలేక పనిగుట్టకొని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయని, చేసిన అభివృద్ధి ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరొకసారి చంద్రబాబుకే పట్టంగట్టాలని ప్రజలు కృత నిశ్చయంతో ఉన్నారని అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు, వంతెనలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, కోఆపరేటివ్ భవనాలు, గ్రామ సచివాలయాలు, గ్రామ రెవిన్యూ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, పక్కా స్కూలు బిల్డింగులు, కాలేజీ భవనాలు కట్టించిన ఘనత ఒక్క టిడిపి పార్టీకే దక్కుతుందన్నారు. అలాగే వివిద కార్పోరేషన్ల ద్వారా ఋణ సదుపాయాన్ని కల్పిస్తూ ఆదరణ పథకంతో చేతివృత్తుల వార్కి చేయూత, నిరుద్యోగులకు నిరుద్యోగ బృతి, ఎస్‌సి., బిసి., ఎస్‌టి., నూతన వధూవరులకు చంద్రన్న పెళ్ళికానుక, చంద్రన్న చేయూత వంటి వినూత్న పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో అందరి మన్ననలు పొందారన్నారు. అలాగే 16 కోట్లతో ముమ్మిడివరప్పాడు రోడ్డు, ఈతకోట నుండి కొత్తపేట రోడ్డు, పలివెల నుండి గంటి చెక్‌పోస్టు రోడ్డు నిర్మాణానికి సంబందిత మంత్రి అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్ళడమైనది. ఈ కార్యక్రమంలో జక్కంపూడి వెంకటస్వామి, గుత్తుల పట్టాభిరామారావు, కుడుపూడి శ్రీనివాస్, వైవి, అడపా సత్యనారాయణ, కాప గరగయ్య, కముజు గణపతి, నిచ్చెనకోళ్ళ వెంకన్న, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## అతడి బండారం బయట పెడతా!



మీటూ ఉద్యమం బాలీవుడ్ లో మొదలై దక్షణాది చిత్ర పరిశ్రమకు కూడా పాకింది. దక్షణాది నటీమణులు కూడా మీటూ ఉద్యమంలో పాల్గొంటూ సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. కన్నడ నటి శృతి హరిహరన్ ఇటీవల ప్రముఖ నటుడు అర్జున్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఓ చిత్ర షూటింగ్ లో భాగంగా అర్జున్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని శృతి హరిహరన్ ఆరోపించింది. శృతి హరిహరన్ వ్యాఖ్యలని అర్జున్ ఖండించారు. పలువురు హీరోయిన్లు కూడా అర్జున్ కు మద్దత్తు ప్రకటించి శృతి హరిహరన్ వ్యాఖ్యలని కొట్టిపారేశారు. మరో మారు శృతి హరిహరన్ అర్జున్ పై సంచలనం సృష్టించే వ్యాఖ్యలు చేసింది. అర్జున్ పై నేను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా. ఎవరెన్ని బెదిరింపులు చేసినా వెనక్కి వెళ్ళను. అతడు నాతో అసభ్యంగా ప్రవర్తించాడనేది నిజం అని శృతి హరిహరన్ స్పష్టం చేసింది. ఆధారాలు ఉన్నాయి నాపై పరువునష్టం దావా వేస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నా. అతడు ఎలాంటి వాడో నావద్ద ఆధారాలు ఉన్నాయి. నన్ను విమర్శిస్తున్న ప్రతి ఒక్కరికి ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదు. పరువునష్టం దావా వేస్తే కోర్టులో ఆధారాలు చూపిస్తా అంటూ శృతి సంచలన వ్యాఖ్యలు చేసింది. అర్థ నగ్న ప్రదర్శనలు ఈ వ్యవహారంపై యంగ్ హీరోయిన్ హర్షిక స్పందించారు. అర్జున్ కు మద్దత్తు ప్రకటించారు.

శృతి హరిహరన్ పై హర్షిక పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. కొంతమంది మీటూ పేరుతో ప్రముఖులపై ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నావారే గతంలో కొందరు వద్ద అర్థ నగ్న ప్రదర్శనలు చేశారని హర్షిక సంచలన వ్యాఖ్యలు చేసింది. అర్జున్ మంచివారు అర్జున్ చాలా మంచివారని సీనియర్ నటి తార అభిప్రాయ పడ్డారు. అర్జున్ తో చాలా సినిమాల్లో కలసి నటించా. ఆయన ఏ సందర్భంలోనూ, ఎవరితోనూ తప్పుగా ప్రవర్తించలేదు అని తార అర్జున్ కు మద్దత్తు తెలిపింది.

## హీరోయిన్‌పై డైరెక్టర్ కామెంట్స్!





మీటూ ఉద్యమ ధాటికి సినీప్రముఖులు జాతకాలాన్ని బయట పడుతున్నాయి. బాలీవుడ్ లో అయితే మీటూ ఉద్యమం పెను సంచలనం సృష్టిస్తోంది. లైంగిక వేధింపులు ఎదుర్కొన నటీమణులంతా తమకు జరిగిన సంఘటనలని బయట పెడుతున్నారు. ఈ క్రమంలో స్టార్ డైరెక్టర్లు, నటులపై తీవ్రమైన ఆరోపణలు ఎదురవుతున్న సంగతి తెలిసిందే. హీరోయిన్ సంజన కూడా దర్శకుడు రవి శ్రీవత్సపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసింది. సంజన ఆరోపణలపై రవి శ్రీవత్స స్పందించారు. గండ హెండతి చిత్రంతో ముద్దుల పేరుతో దర్శకుడు తనని వేధించాడని సంజన ఆరోపించింది. ఏ చిత్రంలో కేవలం ఒకే ముద్దు సన్నివేశం ఉంటుందని చెప్పి చివరకు 30 ముద్దులు పెట్టించాడని సంజన ఆరోపించింది. దర్శకుడు కూడా తనకు ముద్దులు పట్టేందుకు ప్రయత్నించాడని సంజన తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఎలా ముద్దు పెట్టగలను షూటింగ్ లో అంత మంది మధ్య హీరోయిన్ కి తాను ఎలా ముద్దు పెట్టగలను అని దర్శకుడు శ్రీవత్స ప్రశ్నించారు. సంజన కావాలనే తనపై అక్కసుతో ఆరోపణలు చేస్తోందని రవి శ్రీవత్స అన్నారు. తాను సినిమా చేసింది ముద్దులు పెట్టడానికి కాదని బదులిచ్చారు. చూడమని సీడీ ఇచ్చా గండ హెండతి చిత్రం మర్డర్ చిత్రానికి రీమేక్ గా తెరకెక్కుతోందని ఒకటికి రెండు సార్లు ఆమెతో చర్చించిన తరువాతే సినిమాలోకి తీసుకున్నాము. మర్డర్ చిత్రాన్ని చూడమని ఆమెకు సీడీ కూడా ఇచ్చానని దర్శకుడు పేర్కొన్నాడు.

సంజన పబ్లిసిటీ కోసమే ఆరోపణలు చేస్తున్నట్లు ఉందని రవి శ్రీవత్స అన్నారు.

తనకు శుక్రవారంలోగా సంజన క్షమాపణలు చెప్పాలి. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటా అని హెచ్చరించారు. మీటూ ఉద్యమాన్ని కొందరు పబ్లిసిటీ కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.

## త్రివిక్రమ్, నందమూరి కాంబినేషన్‌లో మరో చిత్రం..



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్ లో రూపొందిన అరవింద సమేత వీర రాఘవ చిత్రం ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పటికి ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తూ బయ్యర్లకు లాభాలు తెచ్చిపెట్టే దిశగా సాగుతోంది. ఎన్టీఆర్ గతంలో కూడా ఫ్యాషన్ తరహా చిత్రంలో నటించాడు. కానీ అరవింద సమేత విభిన్నమైనది. అరవింద సమేతతో త్రివిక్రమ్ ఎన్టీఆర్ కు మెమొరబుల్ హిట్ అందించాడు. త్రివిక్రమ్ తదుపరి చిత్రాల గురించి చాలా రోజులుగా ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. సమీప భవిష్యత్తులో త్రివిక్రమ్, నందమూరి కాంబోలో మరో సినిమా ఉంటుందనేది లేటెస్ట్ గా ఫిలిం నగర్ లో వినిపిస్తున్న టాక్. అరవింద సమేత చిత్రానికి సంబంధించిన ప్రతి ఈవెంట్ లో త్రివిక్రమ్ శ్రీనివాస్ తనకు ఆప్తుడిగా మారిపోయారని ఎన్టీఆర్ చెబుతున్న సంగతి తెలిసిందే. అంతలా వీరి మధ్య బాండింగ్ ఏర్పడింది. ఎన్టీఆర్ ని త్రివిక్రమ్ ఈ చిత్రంలో పవర్ ఫుల్ లుక్ లో చూపించారు. కళ్యాణ్ రామ్ నిర్మాణంలో తాజాగా ఇండస్ట్రీలో ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. నందమూరి కళ్యాణ్ రామ్ నిర్మాణంలో ఓ చిత్రం చేసేందుకు త్రివిక్రమ్ అంగీకరించారట. కళ్యాణ్ రామ్ హీరోగా మాత్రమే కాక నిర్మాతగా కూడా రాణిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్ లో కళ్యాణ్ రామ్ కిక్2, జై లవకుశ వంటి చిత్రాలు నిర్మించిన సంగతి తెలిసిందే. యువ హీరోతో ఈ చిత్రంలో ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ కాకుండా మరో యువ హీరో నటించే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. త్రివిక్రమ్ ప్రస్తుతం కమిటై ఉన్న చిత్రాలు పూర్తి చేసిన తరువాత కళ్యాణ్ రామ్ సినిమాపై దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి.

### సూపర్ స్టార్ మహేష్ ఈవెంట్‌కు

## ఊహించని షాక్..



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం యూఎస్ లో తన కుటుంబంతో సరదాగా గడుపుతున్నాడు. వాస్తవానికి యూఎస్ లో మహేష్ తాజా చిత్రం మహర్షి షూటింగ్ జరుగుతోంది. షూటింగ్ కి కొంత గ్యాప్ రావడంతో మహేష్ కుటుంబ సభ్యులతో గడుపుతున్నాడు. ఇదిలా ఉండగా మహేష్ ఖాళీ సమయాన్ని ఉపయోగించుకునేందుకు మా అసోసియేషన్ వారు వేసిన ఎత్తుగడ ఫలించలేదు. మా అసోసియేషన్ కు సొంతంగా బిల్డింగ్ ఉండాలని, బిల్డింగ్ నిర్మాణం కోసం చాలా రోజులుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిధులు లేకపోవడంతో వివిధ రకాల ఈవెంట్స్ నిర్వహించి సేకరించాలని మా అసోసియేషన్ భావించింది. ఎన్నారైలని టార్గెట్ చేసిన మా అసోసియేషన్ గత ఏడాది నుంచి పలు ఈవెంట్స్ నిర్వహిస్తోంది. మహేష్ ప్రస్తుతం యూఎస్ లోనే ఉండడంతో మరో మారు నిధుల సేకరణ కోసం ప్రయత్నించాలని మా అసోసియేషన్ భావించింది. ఈ నెల 27 న మహేష్ బాబు ముఖ్య అతిధిగా ఓ కార్యక్రమాన్ని ప్లాన్ చేశారు. ఈ కార్యక్రమం క్యాన్సిల్ అయినట్లు సమాచారం. ఎన్నారై అభిమానుల నుంచి సరైన స్పందన రాకపోవడంతోనే ఈవెంట్ క్యాన్సిల్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ ఈవెంట్ కు టికెట్ ధర 2 వేల డాలర్లుగా నిర్వహించారు. ఎన్నారై అభిమానులు ఏమాత్రం ఆసక్తి చూపించకపోవడంతో 450 డాలర్లకు టికెట్ ధర తగ్గించారు. అయినా కూడా ఆశించిన రెస్పాన్స్ రాలేదు. దీనితో ఈవెంట్ క్యాన్సిల్ చేసినట్లు తెలుస్తోంది.

## విరాట్‌కు అనుష్క ప్రశంస ఇలా..!



ముంబయి: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ పది వేల పరుగులు చేసి చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. విశాఖలో వెస్టిండీస్‌తో జరిగిన వన్డే మ్యాచ్లో విరాట్ ఈ రికార్డును తిరగరాశాడు. ఆ సమయంలో తన ఇంట్లో మ్యాచ్ వీక్షిస్తున్న అనుష్క కూడా తన భర్త రికార్డును చూసి ఫిదా అయిపోయారు. టీవీలో విరాట్ ఫొటో చూపించి పదివేల పరుగులు చేసినట్లు పేర్కొనడంతో అనుష్క వాటి స్క్రీన్‌షాట్స్ తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. స్క్రీన్‌షాట్స్‌పై వాట్ ఎ మ్యాన్.. అని క్యాప్షన్ రాశారు. విరాట్ ఎప్పుడు ఎలాంటి రాకార్డులు సృష్టించినా అనుష్క వెంటనే తన భర్తను అభినందిస్తూ సోషల్‌మీడియాలో ఫొటోలు పోస్ట్ చేస్తుంటారు. గతంలోనూ ఓ కార్యక్రమంలో అనుష్క.. విరాట్‌తో పెళ్లి గురించి మాట్లాడుతూ..ప్రపంచంలోనే బెస్ట్ బ్యాట్స్‌మెన్‌ని కాదు ప్రపంచంలోనే గొప్ప వ్యక్తిని పెళ్లి చేసుకున్నాను అని చెప్పారు. బుధవారం విశాఖలో టీమిండియా, వెస్టిండీస్ మధ్య ఉత్కంఠభరితంగా సాగిన రెండో వన్డే టైగా ముగిసింది.




# విశాఖలో ఐటీ విస్తృత సోదాలు

**ఆర్థికంగా, పారిశ్రామికంగా అలజడి**



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ శాఖ మరోసారి తనిఖీలు చేపట్టింది. విశాఖలోని ఎంవీపీ కాలనీలోని అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి సుమారు 50 వాహనాల్లో అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాలకు తనిఖీల నిమిత్తం బయలుదేరి వెళ్లారు. దువ్వాడ సెజ్‌లోని పలు గోదాముల్లో అధికారులు సోదాలు చేస్తున్నారు.

దీంతో పాటు లాజిస్టిక్ రంగంలో భారీ కంపెనీగా ఉన్న టీజీఐలోనూ తనిఖీలు జరుగుతున్నాయి. ఈ సంస్థ తెలంగాణ తెదేపా నేత దేవేందర్‌గౌడ్ బంధువులకు చెందినదిగా తెలుస్తోంది. ఎగుమతులకు సంబంధించి ఆదాయాల్లో అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం రావడంతో ఐటీ అధికారులు ఈ సంస్థపై దృష్టి సారించినట్లు సమాచారం.

ఆర్థికంగా, పారిశ్రామికంగా విస్తృత స్థాయిలో అభివృద్ధి చెందిన విశాఖ నగరంలో కొందరు పన్ను సరిగా చెల్లించడం లేదన్న అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఐటీ శాఖాధికారులు దాడులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ దాడుల ప్రచారం వివిధ రాజకీయ పక్షాల్లో కీలకంగా ఉన్నవారిలోనూ అలజడి రేపుతోంది.

# అంతర్జాతీయ సముద్ర చట్టాలు అతిపెద్ద సవాలు

**గీతంలో మారిటైమ్ వార్‌ఫేర్ సెంటర్ డైరక్టర్**



సాగర్‌నగర్: అంతర్జాతీయ సముద్ర చట్టాలను గౌరవిస్తూ ప్రపంచంలోని 166 దేశాలు సంతకాలు చేసినప్పటికీ వాటిని అంగీకరించినంతగా అమలు చేయడంలో పలు దేశాలు ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని ఇది రానున్న కాలంలో పెద్ద సవాలుగా మారనున్నదని తూర్పు నౌకాదళం మారిటైమ్ వార్ ఫేర్ సెంటర్ డైరక్టర్ కమాండోర్ సుశాంత్ దామ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా లో గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయి 'అంతర్జాతీయ సముద్ర చట్టాలు' అనే అంశంపై ప్రసంగించారు.

ప్రపంచంలో 150 దేశాలు సముద్ర తీర ప్రాంతాన్ని కలిగి ఉన్నాయని, ఆయా దేశాలలో వాణిజ్యం ఎక్కువగా సముద్ర మార్గం ద్వారానే జరుగుతోందన్నారు. ప్రతిదేశం తనకు గల తీర ప్రాంతాన్ని సముద్ర ఉత్పత్తులకోసం, జల రవాణా, దేశ రక్షణకు ఉపయోగించుకునేందుకు వీలు కలిగేలా 1994లో ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సముద్ర చట్టాలను అమలులో తెచ్చిందన్నారు.

దీనిని ఆమోదిస్తూ అమెరికా మినహా అన్ని దేశాలు సంతకాలు చేశాయని అయితే సముద్ర చట్టాలను గౌరవిస్తు భారత్ మాత్రమే సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోగలిగిందన్నారు. చైనా వంటి దేశాలు సముద్ర చట్టాల అమలులో పారదర్శకంగా వ్యవహరించక పోవడం పలు సమస్యలకు దారితీస్తోందని అభిప్రాయ పడ్డారు. భారత నౌకాదళం సముద్ర సరిహద్దులలో నిఘా ఉంచడం వల్లే సముద్రంలో శాంతియుత వాతావరణం నెలకొని ఉందన్నారు. సముద్ర జలాలలో కాలుష్యం, నియంత్రణ లేని చేపల వేట, పైరసీ, సరిహద్దు సమస్యలు, సహజ వాయవు, ఖనిజ సంపదకోసం అన్వేషణ వంటివి పెరుగుతున్న నేపద్యంలో సముద్ర చట్టాలను మరింత పటిష్ఠంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ మారీటైమ్ ఫౌండేషన్ రీజనల్ డైరక్టర్ డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# 27న వెలమ సంక్షేమ సంఘు సమావేశం



మురళీనగర్: వెలమ కుల సంక్షేమాభివృద్ధి కొరకు స్థానిక వర్మ కాంప్లెక్స్ వద్ద గల ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. 27వ తేదీన సాయంత్రం వెలమ సంక్షేమ సంఘం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి 38, 39 వార్డుల వెలమలంతా ఈ సమావేశంలో పాల్గొనవలసిందిగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో మొదటగా స్వర్గీయ గళ్లపల్లి సింహాద్రప్పుడు మాష్టారుకు సంతాప సభ నిర్వహించారు. అనంతరం సంఘ అభివృద్ధి మరియు ఇతర అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పివిఎన్ మాధవ్ (ఎంఎల్‌సి) తైనాల విజయకుమార్ (ఎక్స్ ఎంఎల్‌ఎ), ముత్రి ముత్యాలనాయుడు (వి.సి. నన్నయ్య విశ్వవిద్యాలయం), కింజరపు ప్రభాకర్ (ఎసిపి), రొంగలి జగన్నాథం, చొక్కాకుల వెంకటరావు, పైల ముత్యాలనాయుడు (మాజీ కార్పొరేటర్), సిహెచ్. అప్పల సత్యనారాయణ (పూర్వ ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు), సంఘ గౌరవ అధ్యక్షుడు బోకం శ్రీనివాస్ హాజరవుతారని తెలిపారు.

# అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయెుద్దు



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కేటీఆర్ పరస్పర విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు సంధించుకున్నారు. శాసనసభ ఎన్నికల వేళ.. మంత్రి కేటీఆర్ బంధువు ప్రభాకర్, ఆయన కింది ఉద్యోగులు తనతో పాటు ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆరోపించారు. మరో బంధువు రాధాకృష్ణారావుకు ప్రతిపక్ష నేతల వాహనాలు తనిఖీ చేసే పని అప్పగించారని అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాలన్న నిబంధనలను అధికారులు ఉల్లంఘిస్తున్నారని.. ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ అధికారులపై చర్యలు తీసుకుంటామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ట్విటర్ వేదికగా హెచ్చరించారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. ఉత్తమ్‌కుమార్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు రూ.3కోట్ల నగదు కారులో తరలిస్తూ పట్టుబడ్డారని.. ఉత్తమ్ అందుకే ఇప్పుడు ఉలిక్కి పడుతున్నారని అన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని... ఇలాంటి అంశాలను రాజకీయం చేసి అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయెుద్దని కేటీఆర్ సూచించారు.తో పాటు లాజిస్టిక్ రంగంలో భారీ కంపెనీగా ఉన్న టీజీఐలోనూ తనిఖీలు జరుగుతున్నాయి. ఈ సంస్థ తెలంగాణ తెదేపా నేత దేవేందర్‌గౌడ్ బంధువులకు చెందినదిగా తెలుస్తోంది. ఎగుమతులకు సంబంధించి ఆదాయాల్లో అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం రావడంతో ఐటీ అధికారులు ఈ సంస్థపై దృష్టి సారించినట్లు సమాచారం.

ఆర్థికంగా, పారిశ్రామికంగా విస్తృత స్థాయిలో అభివృద్ధి చెందిన విశాఖ నగరంలో కొందరు పన్ను సరిగా చెల్లించడం లేదన్న అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఐటీ శాఖాధికారులు దాడులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ దాడుల ప్రచారం వివిధ రాజకీయ పక్షాల్లో కీలకంగా ఉన్నవారిలోనూ అలజడి రేపుతోంది.

# అధికారుల టీమ్‌వర్క్ భేష్

- రాష్ట్రాన్ని అభివృద్ధిలో పయనింపజేస్తున్నారు
- ప్రతీ మూడు నెలలకోసారి కాన్ఫరెన్స్ నిర్వహించాలి
- అభివృద్ధి సాధించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



విశాఖపట్నం: క్షేత్రస్థాయిలో జిల్లా అధికారులందరూ ఒక టీమ్ వర్క్‌లా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు తీసుకువెళుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను అభినందించారు. రెండు రోజుల పాటు నిర్వహించే కలక్టర్ల సదస్సులో భాగంగా గురువారం అమరావతిలో నిర్వహించిన మొదటి రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతీ మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసకువెళ్లడానికి సమీక్షించుకోవడం జరుగుతున్నదన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో సంభవించిన తిత్లీ తుపానుకు ఐఎఎస్ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, మంత్రులు, అన్ని జిల్లాల అధికారుల బృందం, సిబ్బంది సుమారు 12 రోజుల పాటు దసరాకు కూడా వెళ్లకుండా తుపాను సహాయక చర్యలలో పాల్గొని బాధితులకు తక్షణ సహాయం అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చిన ప్రతీ ఒక్కరికీ తన కృతజ్ఞతలను మరియు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతం లోటు 25 శాతం ఉందని, జల సంరక్షణకు పది లక్షల నీటి కుంటలను తవ్వడం జరిగిందని, గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం చేయడం ద్వారా భూగర్భ జల వనరులను పెంచుకోవడం జరిగిందన్నారు. గత నాలుగు సంవత్సరాల కాలంలో 10.2 శాతం వృద్ధి రేటును సాధించి దేశంలోనే గరిష్టాభివృద్ధికి తీసుకు రావడం జరిగిందన్నారు. తలసరి ఆదాయం వ్యవసాయంకంటే నాలుగు రెట్లు ఎక్కువ పరిశ్రమల రంగంలోను, సేవా రంగంలోనూ 7 రెట్లు, సాంకేతిక రంగంలో అత్యధిక శాతం ఎక్కువ వచ్చిందన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని కొత్త అభివృద్ధి పథంలోనికి సాధించుకోవడం జరుగుతుందన్నారు. ముందుగా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తిత్లీ తుఫానులో మరణించిన వారికి సంతాప సూచకంగా ఒక నిముషం మౌనం పాటించారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.ఇ. కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించిన భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయంలో నూతన టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా వ్యవసాయదారుల జీవితాలలో మార్పును తీసుకువచ్చినందుకు 11వ గ్లోబల్ అగ్రికల్చరల్ లీడర్‌షిప్ అవార్డుకు మన సీఎంను ఎంపిక చేయడం అందరూ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారథులు అధికారులేనని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు.

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక రంగంలో పెరుగుదలలో అభివృద్ధిని సాధించిందన్నారు. డబుల్ డిజిటల్‌ను సస్టైనబుల్ డవలప్‌మెంట్ గ్రోత్ రేటును పరిశ్రమలు, సర్వీసెస్ రంగాలలో అధిక వృద్ధిని సాధించామన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర రెడ్డి, సిపిఓ రామశాస్త్రి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**తిత్లి తుఫాన్ బాధితుల సహాయార్థం**

# ప్రజలు భాగస్వాములు కావాలి ...

**టాలివుడ్ యాక్టర్ రాంకి....**



కంచరపాలెం: ఇటివలే శ్రీకాకుళంలో తిత్లి తుఫాన్ బారిన పడి సర్వం కొల్పోయిన బాధితుల సహాయార్థం ప్రజల బాగస్వాములు కావలని టాలివుడ్ యాక్టర్ రాంక పిలుపునిచ్చారు . ఈమేరకు తిత్లి తుఫాను భీభత్సం తో అతలాకుతలం అయిన శ్రీకాకుళం ప్రాంత ప్రజల్ని ఆదుకునేందుకు టాలీవుడ్ యాక్టర్ రాంకి ముందుకొచ్చారు. తిత్లి తుఫాన్ కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడంతో ఆయన చలించిపొయారు.. ఎవరైనా కష్టాల్లో ఉన్నారన్న విషయం తెలిసినా... ప్రకృతి వైపరీత్యాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని తెలిసినా ఆయన సేవా దృక్పథంతో ముందుకు వస్తారు.. అదేరకంగా తిత్లి తుఫాను బాధితుల సహాయార్థం నిత్యవసర వస్తువులు అందజేయడానికి ముందుకు వచ్చిన ఆయన శ్రీకాకుళం జిల్లా.. కోటబొమ్మలి మండలం.. వడ్డితాంద్ర ..బారువ ...తదితర గ్రామాల్లో ని బాధితులకు నిత్యవసర విశాఖ నుంచి తీసుకువెళ్లి వస్తువులను అందజేసి స్ఫూర్తి దాయకంగా నిలిచారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా అనేక మంది ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు .

**LOANS / లోన్స్**
**HAPPY HOMES**
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
**94902 33750**

## పోర్న్ వెబ్‌సైట్లను బ్లాక్ చేయండి

న్యూఢిల్లీ: దేశమంతా 827 పోర్న్ వెబ్‌సైట్లను బ్లాక్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించింది. ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

న్యాయస్థానం మొత్తం 857 వెబ్‌సైట్లను బ్లాక్ చేయాలని పేర్కొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com